T.T.D. Religious Publications Series No. 1055
Price :

Published by Sri M.G.Gopal, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుచానూరుక్షేత్రం

**(అలమేలుమంగపట్నంమహిమ - ఉత్సవాలు)**

**-జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2014**

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుచానూరుక్షేత్రం

(అలమేలుమంగపట్నంమహిమ - ఉత్సవాలు)

రచన
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
తిరుపతి

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2014

# TIRUCHANOORU KSHETRAM

*by*
**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1055
© All Rights Reserved

*First  Print  : 2013*

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by:*
**M.G. GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati  Devasthanams,
Tirupati.

*D.T.P:*
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati.

# ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం  శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు రచించిన **'తిరుచానూరుక్షేత్రం'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు

అందజేస్తున్నాము. భక్తు లీ గ్రంథం ద్వారా తిరుచానూరుక్షేత్రంలో వెలిసివున్న శ్రీపద్మావతి అమ్మవారి చరిత్రను, అక్కడ జరుగుతున్న సేవలను గూర్చి తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి.
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

## విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | -- | iii |
| తిరుచానూరుక్షేత్రం | -- | 1 |
| ఒకింత దయ | -- | 4 |
| స్థలపురాణం | -- | 9 |
| పూజ లేకుండుగాక | -- | 12 |
| స్థాణువుగా పడివుండు | -- | 13 |
| అందరి పూజలందుకో పరంధామా! | -- | 14 |
| వైకుంఠం వీడిన లక్ష్మి | -- | 16 |
| కోలాసుర భయంకరి | -- | 19 |
| లక్ష్మికోసం వెతుకులాట | -- | 20 |
| విష్ణువే వరాహస్వామి | -- | 24 |
| యశోదే వకుళమాత | -- | 24 |
| వేదవతే పద్మావతి | -- | 26 |
| లక్ష్మీదేవే వేదవతి | -- | 27 |
| శ్రీనివాసకల్యాణం | -- | 28 |
| కొల్హాపుర యాత్ర | -- | 28 |
| ఆకాశవాణి | -- | 29 |
| శ్రీనివాసుని తపస్సు | -- | 29 |
| అలమేలుమంగ అవతరణ | -- | 30 |

| | | |
|---|---|---|
| పద్మసరోవర మహిమ | -- | 34 |
| తిరుచానూరుక్షేత్రం | -- | 42 |
| పద్మసరోవరం | -- | 43 |
| శ్రీ సూర్యనారాయణస్వామిగుడి | -- | 47 |
| శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణం | -- | 52 |
| శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం | -- | 52 |
| శ్రీపద్మావతి అమ్మవారి ఉత్సవాలు | -- | 56 |
| శ్రీ బలరామకృష్ణస్వామి ఆలయం | -- | 61 |
| శ్రీ సుందరరాజస్వామి ఆలయం | -- | 68 |
| సమర్పణ | -- | 74 |

# తిరుచానూరుక్షేత్రం

## (క్షేత్రమహిమ - ఉత్సవాలు)

**ఈశానాం జగతో௨స్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాసరసికాం తత్క్షాంతిసంవర్ధినీం**
**పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్**

శ్రీవేంకటేశ్వరస్వామి తెలుగువారి ఇలలో వెలసిన దేవుడు మాత్రమేకాదు. తెలుగువారికి ఇంటి దేవుడు కూడా! ఆ స్వామి ఏడుకొండలమీద కొలువై వున్నాడు. ఈ ఏడేడులోకాల్లో ఈడులేని దేవుడు ఆయన! అటు గడచిన అనంతకాలంలో ఆ స్వామికి సాటిరాగల దేవుడు లేడు. పోనీ ఇటు రాబోయే కాలంలోనో! అంటే కనీసం ఆయనకు సమానమైన దేవుడుకూడ ఉండబోడు. కనపడదు మరి!

ప్రస్తుతం ఈ వర్తమాన కాలంలో మనభాగ్యంకొద్దీ మనం ఉన్న ఈ కాలంలో మన కళ్ల ఎదుటే, అదుగో! ఆ ఏడుకొండలమీద కొండంత దయను చూపుతూ ఉన్నదేవుడు. నిండుగా చిరునవ్వుతో అనుగ్రహిస్తున్న దేవదేవుడు. దండిగా, మెండుగా వరాలను గుప్పిస్తూ భక్తులను చల్లగా చూస్తున్న కొండంత దేవుడు శ్రీనివాసుడు (ఏడుకొండలవాడు). ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఏడుకొండలమీద వున్నందువల్ల ఆ స్వామికి "ఏడుకొండలవాడు" అనే పేరు ఏర్పడింది.

ఇక ఆ ఏడుకొండలవాడి 'దయ'కు ప్రతిరూపమా అన్నట్లుగా దర్శనమిస్తున్న తల్లి అలమేలుమంగమ్మ! ఆ తల్లికి "పద్మావతి" అని మరోపేరు కూడ ఉంది. ఈ జగన్మాత శ్రీవేంకటేశ్వరస్వామివారి పట్టపుదేవేరి. ఈ

అలమేలుమంగమ్మ తిరుమలలోని ఆనందనిలయంలో శ్రీనివాసుని వక్షః స్థలంలో "ద్విభుజా వ్యూహలక్ష్మీ" అన్నట్లుగా రెండుభుజాలతో, అనగా రెండు చేతుల్లో పద్మాలను ధరించి పద్మంలో కూర్చున్న భంగిమలో "వ్యూహలక్ష్మి" పేరుతో వెలిసివుంది.

అంతేకాదు. ఆ ఏడుకొండలకింద దూరాన "తిరుచానూరు" అనే ఊళ్లో పద్మంలో ఆసీనురాలై చతుర్భుజాలతో అర్చామూర్తిగా దర్శనమిస్తున్నది ఆ తల్లి! పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి, క్రింది కుడి, ఎడమ హస్తాలను అభయ వరదముద్రలతో అర్చామూర్తిగా పద్మావతిగా దర్శన మిస్తున్నందువల్ల ఈ క్షేత్రం "అలమేలుమంగపట్నం" అనీ, "తిరుచానూరు" అనీ ప్రసిద్ధమైన పేర్లను పొందింది. అంతకు ముందు ఆ ఊరికి ఏపేరు వుందో తెలియదు కాని, మంగమ్మతల్లి వెలసివున్న నాటినుండి అది "మంగపట్నం" అనే పేరుతో పిలువబడుతూ, ప్రసిద్ధి కెక్కింది.

సరే బాగుంది. కాని ఇక్కడ ఒక సందేహం కలుగుతుంది. ఒక అనుమానం వస్తుంది.

పెనిమిటి అయిన శ్రీనివాసుడు ఆ కొండమీదనా! ఆయన పత్ని పద్మావతి ఆ కొండకు క్రింద, దూరాన ఈ మారుమూల పల్లెలోనా! ఇది మరీ విడ్డూరంగా ఉంది! మరీ చోద్యంగాను ఉంది.

అవును. ఔనౌను! ఎంత చోద్యంగా వున్నా, మరెంత విచిత్రంగా వున్నా, ఇది మాత్రం నిజం! మగడు "ఏడుకొండలవాడు" మాత్రం ఆ కొండలపైన ఉండడం, ఆయన మగువ "మంగమ్మ" మాత్రం ఏడుకొండల క్రింద దూరాన ఇక్కడ ఈ ఊళ్ళో ఉండడం విచిత్రమైన విషయమే మరి!

అలా వాళ్ళిద్దరూ దూరదూరంగా ఎందుకు ఉన్నారు? అలా వుండటానికి కారణాలు ఏమిటి? ఎప్పటినుంచి అలా దూరదూరంగా



వున్నారు? అన్న సందేహ పరంపరలను తీర్చుకుంటే చాలు. అనుమానాలను పోగొట్టుకొంటే చాలు.

మనకు తిరుచానూరు స్థలపురాణమూ తెలుస్తుంది. ఆ క్షేత్రమహిమా తెలియవస్తుంది.

చాల చిన్న ఊరు. చిన్నదే అయినా ఆ ఊరు ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా పేరు పొందింది.

ఆ క్షేత్రాన్ని 'మంగపట్నం' అంటారు కొందరు. అదే అలమేలుమంగ పట్నం.

'పద్మావతి మందిర్' అనీ, పద్మావతీపురం అని అంటారు ఔత్తరాహులైన హిందీ భక్తులు.

"శ్రీ శుకపురం"గా వర్ణిస్తున్నాయి పురాణాలు. శ్రీశుకపురమే ఆ తర్వాత తర్వాత 'తిరుచ్చుకపురం'గా 'తిరుచ్చుకనూరు'గా 'తిరుచానూరు'గా పిలువబడిందని అంటారు పెద్దలు.

ఇన్ని పేర్లతో పిలువ బడుతున్న "తిరుచానూరు" తిరుపతి పట్టణానికి సరిగ్గా ఆగ్నేయదిక్కున 3 మైళ్ల దూరంలో ఉంది. ఎవరు ఏ పేరుతో పిలిచినా, ఈ ఊరులో ఇక్కడ వున్నది మాత్రం జగన్మాత అలుమేలుమంగమ్మ!

'అలర్ మేల్ మంగ' అంటే 'పద్మం పైన ప్రకాశించే దివ్యకాంత' అని అర్థం. ఆమే పద్మావతిఅమ్మవారు. సరే!

ఇంతకూ ఎవరు ఈమె? అంటే సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి! అత్యంత దయగల తల్లి! ఆ జగన్మాత దయకోసం, అనుగ్రహం కోసం భక్తులు నిత్యం దర్శిస్తుంటారు. ఒక్క మానవులు మాత్రమేనా! కాదు కాదు. దేవతలు కూడ ఆ తల్లి దయకోసం పడిగాపులు కాస్తుంటారు. అర్రులు చాస్తుంటారు.

అంతెందుకు? వాళ్లు, వీళ్లు మాత్రమే కాదు. సాక్షాత్తు ఆనందనిలయుడే, అలమేలుమంగమ్మ దయకోసం ఏడుకొండలు దిగి ఇక్కడికి వచ్చాడు. ఆ తల్లి దర్శనంకోసం నానా అవస్థలు పడ్డాడు. కంట్లో వత్తులు వేసుకొని కళ్లు కాయలు కాచేట్లుగా నిరీక్షించాడు. తీవ్రంగా తపస్సు చేశాడు. ఒక రోజూ రెండు రోజులు కాదు. ఏకంగా పండ్రెండేండ్లపాటు తిండీతిప్పలు మానుకొని మరీ తపస్సు చేశాడు. ఎట్టకేలకు ఆ తల్లి దయ తలచింది. ఆ ఊళ్లోవున్న పద్మసరోవరంలో సహస్రదళాలు కలిగిన బంగారుపద్మంలో అవతరించింది అలమేలుమంగ. పద్మంలో అవతరించింది కనుక ఆమె "పద్మావతి". అంతేగాక 'అలర్ మేల్ మంగ' అనగా 'పద్మంపై ప్రకాశించే దివ్యకాంత' అని ఇంతకు ముందే చెప్పుకున్నాం కూడ.

వేంకటేశ్వరుడు ఏడుకొండలు దిగి ఎందుకువచ్చాడు. ఇక్కడే పద్మావతి కోసం ఎందుకు తపస్సు చేయవలసివచ్చింది. ఇదెప్పుడు జరిగింది. ఎన్నేళ్లనాటిది ఈ గాథ!

ఈ సందేహ పరంపరలను నివృత్తి చేసుకునే ముందు, అనూచానంగా పెద్దల నోటంబడి వినబడుతున్న మాటల్ని ఒక్కసారి నెమరు వేసుకుందాం.

## ఒకింత దయ

చాల పూర్వం కిందటిమాట!

ఏడుకొండల్లో వేంకటేశ్వరుడు నిలిచివున్నట్లుగానే, ఎత్తైన ఆ ఏడుకొండలకు సమానమైన ఎత్తులోనే వాటికి దీటుగా, మేటిగా వున్న మరొక కొండ శిఖరంపైన పద్మావతిఅమ్మవారు వెలసివుండినారట!

శ్రీనివాసప్రభువులవారి కంటె కూడ పద్మావతిఅమ్మవారు భక్తులపై "ఒకింత దయ"ను ఎక్కువగా చూపిస్తుందట! ఎంతైనా ఆమె అమ్మలగన్న



అమ్మ గదా! అఖిలజగాల నేలే మాతృమూర్తి కదా అలమేలుమంగ! అందువల్లే స్వామివారి కంటెకూడ ఆ జగన్మాత భక్తులపై కురిపించే "కాసింత దయ" అనే బరువువల్ల అమ్మవారు వున్న కొండశిఖరం అమాంతంగా కిందికి కుంగిందట!

ఇదిగో! ఆనాటినుండి శ్రీ వేంకటేశ్వరుడు ఏడుకొండలపైన 'ఆనంద నిలయం' అనే బంగారు మేడలో కొలువై వుండగా, ఆ ఏడుకొండల క్రింద దూరాన పవిత్రమైన పద్మపుష్కరిణి చెంత "శాంతి నిలయం" అనే బంగారు మేడలో అర్చామూర్తిగా కొలువై వుంటున్నది దయాంతరంగిణి అయిన జగన్మాత అలమేలుమంగమ్మ!

తిరుమలకొండమీది శ్రీనివాసుని మాదిరిగా గాక, చక్కగా విశ్రాంతిగా పద్మంపైన కూర్చుని ఉన్నది పద్మావతిఅమ్మవారు. ఆనందనిలయుడు శంఖుచక్రాలను ధరించి, కటి వరద హస్తాలతో నిలిచివుంటూ, ఎక్కడికో పరుగెత్తడానికి సిద్ధంగా వున్నట్లు కనపడతాడు. అలాంటి హడావిడిలో అక్కడ భక్తులు నిదానంగా తమ తమ కోరికలను తీరికగా విన్నవించు కోవడానికి సమయం ఎలా కుదురుతుంది? కుదరనే కుదరదు. అంతేగాక తిరుమలేశుని చెంత ఎన్నో చెప్పుకోవాలనీ, మరెన్నో కోరుకోవాలనీ, అన్న దృఢనిశ్చయంతో "బంగారువాకిళ్ల" చెంతకు చేరుకోగానే, నిలువెత్తు సౌందర్యమూర్తి, ఆజానుబాహువు అయిన ఆ ఆనందనిలయుణ్ణి కన్నులారా దర్శించడంతోనే భక్తులు ఉక్కిరి బిక్కిరి అవుతారు. అంతేకాదు, నిలువెత్తు అలంకరించుకొన్న దివ్యాభరణాలతో, శంఖుచక్రాలతో నొసటన తెల్లగా వున్న మూడునామాలతో విరాజిల్లుతున్న వేంకటప్రభువుల గంభీరమైనమూర్తిని చూచిన వెంటనే, ఏవేవో చెప్పు కోవాలనీ, ఎన్నెన్నో కోరుకోవాలనీ, అనుకున్నవన్నీ భక్తులు మరచిపోతారు. అలా మరచిపోవడం. సహజాతిసహజం! అంతమాత్రమేగాక

నిలువెత్తు ఆ స్వామివారి దివ్యమంగళవిగ్రహరూపాన్ని కిందినుంచి పై వరకు పూర్తిగా చూడలేక, చూడడానికి వలనుపడక తమకు తెలియకుండానే కళ్లు మూతపడడం ప్రతిభక్తుని అనుభవం, అనుభూతి కూడా! ఇలా భక్తులందరినీ సమ్మోహన పరుస్తూ మనస్సును మాయకు లోనుచేసి వాళ్లను మభ్యపెడుతూ ఉంటాడు శ్రీనివాసపరంధాముడు.

మరి ఆ ఘనవేంకటేశుని దేవేరి అయిన పద్మావతిఅమ్మవారో! అలా ఎన్నటికీ భక్తులను మభ్యపెట్టదు. సరికదా! తిరుచానూరు క్షేత్రంలో అర్చామూర్తిగా స్థిరంగా కూర్చునివున్న అమ్మవారు భక్తులను ప్రియంగా, చిరునవ్వుతో ఆహ్వానిస్తుంది. నిండుగా, ఆహ్లాదంగా దర్శనమిస్తూ ఆనంద పెడుతుంది.

ఇక్కడ ఈ క్షేత్రంలో ఎలాంటి తొందరలు ఉండవు. హడావిడి లేకుండా రండి నాయనలారా! అన్నట్లుగా పద్మావతి అమ్మవారు తాను పద్మంలో అర్చామూర్తిగా దర్శనమిస్తూ! "ఇదిగో! ఈ పద్మంలో మీ కోసమే తిరంగా కూర్చొని వున్నాను. నిదానంగా కావలసినవన్నీ కోరుకోండి. నెమ్మదిగా అనుకొన్నవన్నీ అడగండి" అంటూ పద్మంవంటి సున్నితమైన సుమధురమైన మనస్సుతో నిండు దయతో అందరినీ ఆప్యాయంగా ఆదరిస్తూ పలకరిస్తుంది. ఒకటికి రెండుసార్లు ఆలోచించుకొని, మర్చిపోకుండా మరీ మరీ జ్ఞాపకం చేసుకొని అడగండి అంటూ భక్తులను లాలిస్తుంది.

అంతే! ఏ మాత్రం అరమరికలు లేకుండా తొట్రుపాటు లేకుండా అమ్మను కన్నులారా చూస్తూ, భక్తులు తమ తమ బాసల్లో, తమ తమ విన్నపాలను మనసు విప్పి చెప్పుకుంటారు. తీరికగా కూర్చున్న ఆ తల్లి, వాళ్లు చెప్పుకొన్న ఊసులన్నీ ఓపికగా వింటుంది. ఓ అలాగా! అంటూ చెరగని చిరునవ్వుతో ఓర్పుగా, వారి వారి సమస్యల్ని విని పూర్తిగా ఆకళింపు



చేసుకొంటుంది. అర్థం చేసుకుంటుంది అమ్మ అలమేలుమంగమ్మ! కేవలం తాను అవగాహన చేసుకోవడంతో మాత్రమే సరిపెట్టుకోదు. అర్థం చేసుకోవడంతో మాత్రమే ఊరుకోదు. ఓపికగా తాను విన్నవాటిని అన్నింటిని మరింత ఓరిమితో ఎంత మాత్రం విసుగుచెందకుండా, విసుగుపడకుండా విభుడైన వేంకటేశునితో విన్నవిస్తుంది. కేవలం విన్నవించడంతో సరి పెట్టుకోదు. ఊరుకోదు కూడా!

ఇక్కడ ఈ తిరుచానూరుక్షేత్రంలో అర్చారూపంలో విన్నవన్నీ ఏడుకొండలపైన ఆ స్వామివారివక్షఃస్థలంలో ముందుకు చొచ్చుకొనివచ్చి ఆయన చెవికి దగ్గరగా "వ్యూహలక్ష్మి" రూపంలో వున్న పద్మావతిఅమ్మవారు, ఆయన చెవిలో ఇల్లుకట్టుకొని మరీ మరీ విన్నవిస్తుంది. తన బిడ్డల ఆర్తులను, ఆందోళనలను, అవసరాలను, ఆ స్వామివారు పోగొట్టే విధంగా గోముగా, మారాము చేస్తూ వారి కోరికలను అనుగ్రహింపజేస్తుంది.

ఒకవేళ, స్వామివారు 'బిర్రుగా' వుంటేనో! అప్పుడు అంటుంది కదా! స్వామీ!తిరుమలేశా!నా వల్లనే కదా! నీ గుండెమీద పదిలంగావున్న నా ఉనికివల్లనే కదా! నీవు "శ్రీనివాసుడి"గా అయ్యావు. నా కోసం, వైకుంఠం నుంచి రావడమేగాక, నా దయకోసం అస్రులు చాస్తూ తపస్సు చేసినవాడివి. ఆ విషయంమాత్రం మర్చిపోతివా స్వామీ! అంటూ, తన కోరికమేరకు, తన శిఫారసుమేరకు తమ ఇద్దరి అండన చేరిన భక్తులందరిని అక్కున చేర్చుకుని మనస్సుల్ని రంజింపచెయ్యవయ్యా స్వామీ! అంటూ సున్నితంగా, స్వామివారి మనస్సును భక్తుల మీదికి మళ్లింపజేసి ప్రసన్నం చేస్తుంది. దండిగా, నిండుగా, మెండుగా అనుగ్రహింపజేస్తుంది జగన్మాత అలమేలుమంగమ్మ!

ఇంకేముంది! అమ్మమాటను కాదనలేక, అమ్మమాటను జవదాటలేక, "సరే! అమ్మలగన్న అమ్మవుగదా! భక్తులపై నాకంటె కూడా నీకు 'ఒకింతదయ'

ఎక్కువే!" అంటూ ఏడుకొండలవాడు తలను ఊపుతూ, భక్తుల కోరికలను తీరుస్తూవున్నాడు కూడ! ఇది ఏడుకొండల దివ్యక్షేత్రంలో నిత్యమూ జరుగుతున్న తంతు!

సుమారు ఐదువేలఏండ్లకిందట శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మి కోసం తిరుచానూరులోని పద్మసరోవరం చెంత తపస్సు చెయ్యగా ఒకానొక కార్తికమాసంలో శుద్ధపంచమినాడు పద్మసరోవరంలో సహస్రదళాల బంగారుపద్మంలో పద్మావతిగా అవతరించింది.

అందుకు గుర్తుగా నేటికీ ప్రతి సంవత్సరం కార్తిక శుద్ధపంచమిరోజును "పంచమితీర్థం"గా "తిరుచానూరు పంచమి"గా పద్మావతీఅమ్మవారి అవతారం దినోత్సవం ఘనంగా జరుపుబడుతున్నది. ఆనాడు శ్రీనివాసుడు తిరుమల నుంచి పద్మావతిఅమ్మవారికి పసుపుకుంకుమలు, చీరసారె, పిండివంటలను పంపుతున్నాడు. ఆ రోజు తిరుచానూరులో శ్రీపద్మావతిఅమ్మవారికి పద్మపుష్కరిణిలో చక్రస్నానం పూర్తి అయ్యేంతవరకు కూడ తిరుమలలో శ్రీనివాసుడు పచ్చిమంచినీళ్లు కూడ స్వీకరించడని ప్రతీతి!

అనగా తిరుమల క్షేత్రం ఏనాటినుంచి వున్నదో, ఎప్పటినుంచి వున్నదో, తిరుచానూరుకూడ అంతటి ప్రాచీనక్షేత్రమే కాక అంతటి మహిమాన్వితమైన క్షేత్రంగా కూడ విరాజిల్లుతున్నది.

అందువల్ల తిరుమల యాత్రికులు, భక్తులు ముందుగా తిరుచానూరులోని పద్మావతిఅమ్మవారిని దర్శించిన తర్వాతనే, తిరుమల కొండకు వెళ్లి స్వామివారిని దర్శించడం సర్వశ్రేయోదాయకం, సర్వార్థ సిద్ధిప్రదం కూడా!

మరోమాట! ఇది పావనమై స్వర్ణముఖీనదీ తీరంలోని శుకమహర్షి ఆశ్రమ ప్రాంతం! ఆ ప్రక్కనే పరాశరమహర్షి ఆశ్రమం (జోగిమల్లవరం!)



ఇంకోవైపు యోగులకొండ! మరోవైపు ఏడుకొండలు! ఇన్నింటి మధ్యలో నెలకొన్నది అలమేలుమంగపట్నం!

దివ్యమైన భవ్యమైన తిరుచానూరుక్షేత్రం స్థలపురాణాన్ని అక్కడ అలమేలుమంగమ్మకు జరిగే సేవలను ఉత్సవాలను తెలుసుకుందాం.

## స్థలపురాణం

ఐదువేల ఏండ్లనాటి కంటె ముందు మాట!

పవిత్రగంగానది ఒడ్డున మునులందరూ ఒక్కచోట చేరారు. వాళ్లు ఒక యాగం చేయడానికి తలపెట్టారు. లోక కల్యాణంకోసం, ప్రజాసంక్షేమం కోసం 'మహత్తర యజ్ఞం' చేయసంకల్పించారు. అనుకొన్నదే తడవు యాగానికి కావలసిన వస్తువులన్నీ సేకరించుకొన్నారు.

అరణ్యం మధ్యలో జలపాతాల సవ్వళ్లు. సెలఏరుల గలగలలు. పక్షుల కిలకిలారావాలు. జంతువుల అరుపులు... ఇలాంటి ప్రశాంతమైన ఒకానొక సుప్రభాతవేళ! శుభముహూర్తం ఆసన్నమైన వేళ!

మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, హవిస్సులు, హోమధూమాలు... ఇలా వీటిన్నింటితో ఆ వాతావరణం మరింత పరమపవిత్రం అయ్యింది. సర్వత్రా వింత వింతలుగా ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసింది.

ఇంతలో నారాయణ! నారాయణ!! అంటూ పైనుంచి ఊడిపడ్డట్టుగా దేవర్షి నారదులవారు అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

'ఆదిలోనే హంసపాదు' అన్నట్లుగా నారదుడు రావడం, ఇంక ఈ యజ్ఞం పూర్తి అయినట్లే! ఇంతే సంగతులు. అని కొందరు పెదవి విరిచారు. కలహభోజనుని రాక ఎన్ని కలహాలకు నాందో? అని మరికొందరు మహర్షులు విసుక్కున్నారు.

శుభప్రదమైన వేళలో, దేవర్షి నారదులవారు రావడం, దర్శనం ఇవ్వడం చాల విశేషం!

లోకకల్యాణం కోసం జరుపబడే ఈ యాగం తప్పక సుసంపన్నం అవుతుందనుకొంటూ పరమానందపడ్డారు ఇంకొందరు తాపసులు.

ఏది ఏమైనా సరిగ్గా యాగ ప్రారంభవేళలో నారదుడు రావడం, ఈ మహత్కార్యంలో ఎన్నో మార్పులు, చేర్పులు, మలుపులు చోటు చేసుకో బోతున్నాయి కాబోలు! అని అక్కడి పరిస్థితిని ఆసక్తిగా గమనిస్తున్నారు మరికొందరు మునులు.

నారాయణ! నారాయణ!!

నారదుని నామజపంతో అందరి ఆలోచనలు ఆగిపోయాయి.

అందరూ నారదుణ్ణి ఆహ్వానించారు. ఆదరించారు. ఆతిథ్యమిచ్చారు. వారి సత్కారానికి సంబరపడిపోతూ నారదుడు ఇలా అన్నాడు.

మునిపుంగవులారా! మీరందరూ ఏం చేస్తున్నారు. అని ఆసక్తిగా అడిగాడు.

అందరూ ఒక్కుమ్మడిగా ఇలా అన్నారు.

దేవర్షీ! మేం ఒక యాగాన్ని తలపెట్టాం. ఆ యజ్ఞంవల్ల జగత్కల్యాణం సిద్ధించాలన్నదే మా ఉద్దేశం. లోకక్షేమం కోసం సంకల్పించిన శుభప్రదమైన ఈ యజ్ఞవేళలో మీరు రావడం సిద్ధిప్రదం! సర్వశ్రేయోదాయకం కూడా. ఈ మహత్కార్యానికి మీ ఆశీస్సులను కోరుకుంటున్నాం! అన్నారు చేతులెత్తి దండం పెడుతూ.

నారాయణ! నారాయణ!!



– అంటూ తన ముఖాన్ని ప్రశ్నార్థకంగా పెడుతూ ఇలా అన్నాడు.

లోకక్షేమం కోసం యాగమా! బాగుంది, బాగుంది. కాని లోకకల్యాణం సిద్ధింపచేసే యాగదేవత ఎవరు? శివుడా? విష్ణువా? బ్రహ్మదేవుడా? వీళ్లెవరూ కారా? వీళ్లుగాక మీ దృష్టిలో ఇంకెవరైనా ఉన్నారా?

నారదమహర్షి అడిగిన ప్రశ్న పరంపరలకు మునులందరూ అయోమయంలో పడ్డారు. ఒకరి మొగా లొకరు చూసుకొన్నారు.

వారి దీనావస్థను చూచి, మళ్లీ నారదుడే ఇలా అన్నాడు.

దేవతలు అందరిలోనూ త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణువు, శివుడు ప్రధానమైనవారు కదా! వారి ముగ్గురిలో కూడ లోకక్షేమం కల్గించే దేవుడు ఎవరు? అడిగినవెంటనే ఆదుకొనే ఆపద్బంధువు ఎవరు? వేడుకున్న వెంటనే వరాలిచ్చే వేల్పు ఎవరు? పాపాలను ప్రక్షాళనం చేసే పరదైవం ఎవరు? ప్రధానంగా రాబోయే కలికాలంలో. అందర్నీ అన్నీవేళలా అక్కున చేర్చుకొనగల దేవాదిదేవుడు ఎవరు? అర్థించినవారి అరచేతి మాణిక్యం! కోరినవారి కొంగు బంగారం! పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం! ఎవరో నిగ్గు తేల్చి, సర్వోన్నతుడైన ఆ పరదైవాన్ని గూర్చి యాగం చెయ్యండి. మీ కోరిక నెరవేరుతుంది. లోకకల్యాణం సిద్ధిస్తుంది.

నారాయణ! నారాయణ!! అంటూ అంతలోనే అదృశ్యమయ్యాడు నారదులవారు.

## అందరి దేవుడు

నారదుడు ఉన్నపళంగా రావడం, సందేహాన్ని మిగిల్చి అదృశ్యం కావడంతో మునులందరూ ఇహలోకంలో పడ్డారు. ఒకరికొకరు తేరుకొన్నారు. తర్జన భర్జనలకు లోనయ్యారు. పలువిధాల చర్చించుకొన్నారు.

త్రిమూర్తుల్లో ఎవరు గొప్పో? ఎలా తేల్చడం? తేల్చి నిర్ణయించడం అంత సులభమైన పనా? అనుకొంటూ చివరకు ఈ కార్యభారాన్ని తపస్సంపన్నులైన భృగుమహర్షికి అప్పజెప్పుతూ అనేకవిధాలుగా ప్రార్థించారు.

'సరే'నని తల ఊపుస్తూ, జగత్కల్యాణం కోసం కదా! ఎన్ని ఆపదలు ఎదురైనా తప్పదు మరి! – అంటూ తనలో తాను ఆలోచనల్లో పడ్డాడు మహర్షి భృగువు. త్రిమూర్తులు ముగ్గురూ ముగ్గురే కదా! వాళ్లను పరీక్షించి ఎవరు గొప్పో తేల్చడం అంత సులువా? అయినా 'మంత్రసాని పనికి ఒప్పుకొన్నాక, మంచి చెడ్డలకు బెదిరితే ఎలా?' అనుకొంటూ తొలుత సత్యలోకంలో అడుగు పెట్టాడు.

## పూజ లేకుండుగాక

సృష్టికర్త బ్రహ్మదేవుడు ఉండే లోకమే సత్యలోకం!

ఎదురుగా పాలకంటె తెల్లగా వున్న పెద్ద పద్మపీఠంలో నాలుగుమొగాలతో వేదాలను వల్లిస్తున్న బ్రహ్మదేవుడు.

ఆ వేదమంత్రాలఘోష వీనులవిందుగా సాగుతుండడం ఆనందం కలుగుతోంది. ఇక ఆయన తన సంకల్పానికి అనుగుణంగా తన చేతి వేళ్లను అటూ ఇటూ కదల్చుతూ సృష్టికార్యాన్ని నిర్వహిస్తుండడం అద్భుతంగా వుంది. ఆశ్చర్యంగాను ఉంది.

ఆ పక్కనే మరో తెల్లని పద్మంపైన చదువులతల్లి సరస్వతి! ఆ తల్లి తన సున్నితమైన సుకుమారమైన చేతివేళ్లను మీటుతూ చేస్తున్న అద్భుతమైన వీణానాదం మనస్సులను రంజింపజేస్తూ ఆనందమయలోకాల్లో విహరింపజేస్తున్నది.

ఆ సుందరదృశ్యానికి నిశ్చేష్టులయ్యాడు భృగువు. పరమానందపడ్డాడు. పరిపరివిధాల ఆ దివ్య దంపతులను స్తుతించాడు. కీర్తించాడు. లాభం లేదు. కనీసం వాళ్లు తనవంక చూడ్డమే లేదు. అది నిర్లక్ష్యమా! లేక తన రాకను గమనించనే లేదా! లేదు లేదు. తన పక్కన వున్నవారి వందనాలు స్వీకరిస్తున్నారు. వారితో మాట్లాడుతున్నారు. కనీసం ఒక్కసారంటే ఒక్కసారైనా నన్ను చూడవచ్చు కదా. అంత నిరాదరణా! వీళ్లు దేవతలే కావచ్చు. నిలువెత్తు రజోగుణంతో నిండిన వేల్పులు. వీళ్లా గొప్పవాళ్లు? వీళ్లా మేం చేసేయాగానికి అర్హులు? వీళ్లు ఎప్పటికి గొప్పవారు కానే కారు. ఇలా తీవ్రమైన కోపానికి లోనైన భృగువు అంతటితో ఆగక, మా భూలోకంలో నీవంటి రజోగుణ దేవుడికి పూజలులేకుండుగాక! అని బ్రహ్మదేవుణ్ణి శపించి సత్యలోకంనుంచి బయటపడ్డాడు.



## స్థాణువుగా పడివుండు

సత్యలోకం నుంచి బయటపడ్డాడేగాని అక్కడ తనకు జరిగిన అవమానభారం నుంచి బయటపడలేక పోయాడు భృగువు. దాన్నే ఆలోచిస్తూ పరధ్యానంతో కైలాసంలో ప్రవేశించాడు. 'వేళకాని వేళ ఇది! పార్వతీ పరమేశ్వరుల ఏకాంతానికి భంగం కలుగకుండా వచ్చినదారే తిరిగి వెళ్లిపో!' అంటూ అడ్డుతగిలాడు నందీశ్వరుడు.

కోపిష్ఠుడయిన ఆ తాపసికి నందీశ్వరుడు ఒక లెక్కా! అతణ్ణి తోసివేస్తూ కైలాసంలో జొరబడ్డాడు భృగువు. అంతే! ప్రణయమూర్తులైన పార్వతీపరమేశ్వరుల ఏకాంతానికి భంగం వాటిల్లింది. అంతే! రుద్రుడు కోపంతో తాండవం చేస్తూ త్రిశూలంతో భృగువును చంపబోయాడు. అంతలో పార్వతి అడ్డు తగలడంతో చావును తృటిలో తప్పించుకున్న భృగువు బతుకు జీవుడా! అనుకొంటూ, శివుణ్ణి చూస్తూ, పరమతామసుడవైన నీవు భూలోకంలో స్థాణువై పడివుండుదువుగాక! లింగాకారంలో పూజ లందుదువుగాక! అంటు కసిగా శపించి అక్కడి నుంచి వైకుంఠం వైపు నడిచాడు భృగుమహర్షి!

## అందరిపూజ లందుకో పరంధామా

వికలమైన మనోభారంతో భృగువు వైకుంఠంలో కాలుపెట్టాడు.

వైకుంఠ మహాద్వారానికి కాపలాగావున్న జయవిజయులు భృగువు వాలకాన్ని చూసి కాస్త జడుసుకున్నారు.

వారి అడ్డగింపు ఏమీ పని చెయ్యలేదు. భృగువు అదుపులేని వేగంతో వైకుంఠంలోని అంతఃపురమందిరంలోనికి దూకుడుగా ప్రవేశించాడు.

ఆహా! ఏమా సుందరదృశ్యం! శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు! ఆయన వక్షఃస్థలంపై సుతారంగా తల ఆన్చి ముచ్చటిస్తున్న శ్రీమహాలక్ష్మి!! ఆ నయనమనోహర దృశ్యాన్ని చూస్తూ ఒక క్షణంపాటు నిశ్చేష్టుడై ఆనందానికి లోనయ్యాడు. భృగుమహర్షి! కాని అంతలోనే నిలువెత్తు ఒళ్లంతా ఆవరించిన కోపం ఆయన ఆ పరమానందాన్ని కప్పివేసింది. తుడిచిపెట్టింది.

దివ్యమంగళ దంపతులైన శ్రీలక్ష్మీనారాయణులు ఈ తాపసిని గమనించినా, ఏమాత్రం చూడనట్లుగా నటించారు. నటనలో సాక్షాత్తు పరమశివుణ్ణే భ్రమింపజేసిన జగన్మోహనమూర్తి కదా శ్రీమహావిష్ణువు! భృగువు ఒక లెక్కా!

పాపం భృగువు! తనను వాళ్లిద్దరూ గమనించాలని వాళ్ల దృష్టిలో పడాలని అనేకవిధాల ప్రార్థించాడు. స్తుతించాడు. ఎన్నో హావభావాల్ని ప్రకటించాడు. ప్చ్! లాభం లేకపోవడమే గాక! నారాయణుడు శ్రీమహాలక్ష్మిని మరింత దగ్గరగా హృదయానికి హత్తుకొన్నాడు. ప్రక్కనేవున్నా తనను ఏమాత్రం గమనించకపోగా, తన ఎదుటే ఇంతటి శృంగారమా! ఆ మహర్షి కోపం అరికాలినుంచి నసాళాని కెక్కింది. సత్యలోకంలో, కైలాసంలో మాటలతో సరిపెట్టుకొన్న కోపం, కట్టలు తెంచుకొని, చేతలకు పురికొల్పింది. అంతే!



కోపోద్రేకంలో ఉన్నపళంగా పరుగెత్తి కుడికాలితో శ్రీవారి వక్షఃస్థలంపై తన్నినాడు. తాను కేవలం మానవుడు కదా! ఆ స్వామి సాక్షాత్తు పరంధాముడు కదా! అన్న విచక్షణా జ్ఞానం కూడా కోల్పోయి, ఇంతటి ఆఘాయిత్యానికి ఒడిగట్టాడు ఆ కోపిష్టి తాపసి.

ఎంతటి గొప్పవాడైనా కోపతాపాలకు వశుడైనవాని ప్రవర్తన ఇలా గాక మరెలా వుంటుంది?

అందుకే పెద్దలు "తన కోపమె తన శత్రువు" అని ఊరకనే అన్నారా?

ఈ హఠాత్సంఘటనకు అదిరిపడింది ఆదిలక్ష్మి! ఉలిక్కిపడుతూ పక్కకు తొలిగింది. అంతే కోపిష్టి అయిన ఆ ఋషికాలు శ్రీమన్నారాయణుని ఎదపై బలంగా తాకింది.

ఈ వింత సంఘటనకు తేరుకొన్న శ్రీహరి, తటాలున శయ్య నుండి పైకి లేచి కోపంతో ఊగుతున్న భృగుమునికి నమస్కరించాడు. అయ్యా! మునీశ్వరా! ఏమరుపాటున మిమ్మల్ని గమనించకపోవడం తప్పే నంటూ శేషశయ్య మీద కూర్చుండ బెట్టాడు. జరిగిన పొరబాటుకు క్షమించమంటూ, ఆయన పాదాలను ఒత్తుతూ, పాదంలో వున్న అహంకార నేత్రాన్ని చిదిపివేశాడు.

అంతే! ఆ ఋషికి తన అజ్ఞానం, అహంకారం ఇత్యాది అవలక్షణాలన్నీ తెలియవచ్చాయి. తాను చేసిన మహా అపరాధాన్ని క్షమించవలసిందని శ్రీలక్ష్మీనారాయణులను వేడుకొన్నాడు. పెక్కువిధాల కీర్తించినాడు. తాను అవివేకంతో ఇంతటి అకృత్యం చేసినా, క్షమాబుద్ధితో అనుగ్రహించిన పరంధామా! నీవే రాబోయే సంక్లిష్టమైన కలియుగంలో ప్రత్యక్షంగా అందరిచేత పూజలందుకొనగల దేవాది దేవుడివి! కోట్లాదిమంది భక్తులను అందరినీ పరమసాత్వికమైన సుందరరూపంతో ఓపికగా, ఓర్పుగా ఆదుకొని

అలరించగల ఆనందనిలయుడివి. కొండంత దయతో లోకకల్యాణ కారకుడవైన నిత్యకల్యాణ చక్రవర్తివి! స్వామీ!

లోకక్షేమం కోసం మా మునిలోకం అంతా, నిర్వహించే యాగానికి సర్వోత్తముడవైన యజ్ఞాధిదేవతవు నీవే స్వామీ! అంటూ సాష్టాంగదండ ప్రణామాలు చేసి భూలోకానికి తిరుగు ప్రయాణమయ్యాడు భృగుసత్తముడు!

భృగుమహర్షి నిర్ణయం మేరకు, శ్రీమహావిష్ణువు ప్రధానదైవంగా యాగం ఘనంగా జరిగింది.

ఆ యాగఫలితంగా సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి, శ్రీమహావిష్ణువు శ్రీవైకుంఠం నుండి భువికి తరలి వచ్చారు.

అదెలా జరిగింది. అంటే!

మనం భృగువు వెంట అన్నిలోకాలు తిరుగుతూ, మనం మళ్లీ భువికి వచ్చాం.

కాని, ఆ కోపిష్ఠి మహర్షి పెట్టిన చిచ్చువల్ల శ్రీవైకుంఠం ఎలాగుందో! అక్కడి పరిస్థితి ఎలాగుందో!... ఆ తర్వాతి కథ ఏంటో!... తెలుసుకోవాలంటే మనం మళ్లీ వైకుంఠ లోకానికి వెళ్లాల్సిందే తప్పదు మరి!

## వైకుంఠం వీడిన లక్ష్మి

శ్రీవారి హృదయంలో ఎల్లప్పుడూ తాను వుంటూవున్న పవిత్ర స్థానాన్ని కాలితో తన్ని మహాపాపం చేసిన ఆ తాపసి దూకుడుతనానికి, దుర్మార్గానికి అడ్డుకట్ట వేయకుండా, శిక్షించకుండా, ఆయనను తమ శేషశయ్యపైన కూర్చోబెట్టడమా! పైగా ఆయన కాళ్లు పట్టుకొని నమస్కరించి ఒత్తడం కూడానా! ఎంతటి అప్రతిష్ఠ! ఎంతటి అవమానం! తన కళ్ల ఎదుటే తన



ప్రాణనాథుడు ఆ మునికాళ్లను పట్టుకొనడం, క్షమించమనడం తనకు జరిగిన అవమానంగా భావించింది శ్రీమహాలక్ష్మి. తన సొంత ఇంట్లోనే తనకు జరిగిన దుర్ఘటనకు ఆమె మనసు వికలమయింది. కోపంతో అలిగి, వైకుంఠం విడిచి బయలుదేరింది.

జరుగుతున్న విపరీత పరిణామాలకు విస్తుబోయిన విష్ణుభగవానుడు తేరుకొన్నాడు. లక్ష్మిని అర్థించాడు. ప్రాధేయపడ్డాడు. ఆ కార్యాన్ని అంత తీవ్రంగా పరిగణించ వద్దన్నాడు. భృగువు తమ బిడ్డలాంటివాడు. బిడ్డ తల్లిదండ్రుల ఎదలపై తన్నడం, పాదాలతో తొక్కడం అత్యంత సహజం కదా. అందువల్ల వైకుంఠాన్ని విడిచి వెళ్లవద్దని అనేక విధాలుగా లక్ష్మీదేవిని వేడుకున్నాడు.

నిజమే! నీవన్నట్లు అలా జరిగి ఉండకూడదు. కొన్ని క్షణాల్లో జరిగిపోయింది. ఆ దుర్ఘటన నీకు బాధను కలిగించింది. నన్ను క్షమించు. అంతేకాని ఆ అవివేకపు మునిపై కోపంతో, పచ్చనిసంసారాన్ని వదలిపెట్టవద్దు. అర్థంలేని ఆవేశంతో వైకుంఠలోకాన్నీ, నన్నూ విడిచి వెళ్లవద్దు. దీనివల్ల ఇద్దరమూ చాల బాధలు పడవలసివస్తుంది. ఇద్దరం నష్టపోతాం. అంటూ శ్రీనివాసుడు పరిపరి విధాలుగా లక్ష్మీదేవిని వేడుకొన్నాడు. ప్రాధేయపడినాడు.

“తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు” అన్నట్లుగా, పట్టిన పట్టు వీడకుండా, ససేమిరా! అంటూ లక్ష్మీదేవి వైకుంఠలోకాన్నీ, విష్ణుదేవుణ్ణీ విడిచిపెట్టి పాతాళలోకంలో వున్న కపిలమహాముని ఆశ్రమాన్ని చేరుకొంది. ఆ మహర్షి ఆ తల్లిని చేరదీసి, ఓదారుస్తూ “అమ్మా! నీకు ఇష్టం వచ్చినన్నాళ్లు ఇక్కడ ఉండవచ్చు” అన్నాడు. ఆనాటి నుండి కపిలుని ఆశ్రమంలో ప్రశాంతంగా ధ్యానం చేసికొంటూ తపస్సును కొనసాగించింది సిరులతల్లి లక్ష్మి.



కొల్హాపురం శ్రీమహాలక్ష్మి
(మహారాష్ట్ర)



## కోలాసుర భయంకరి

కొంతకాలానికి అగస్త్యాది మహారుషులు, దేవతలు కపిలమహర్షి ఆశ్రమంలో ఉన్న లక్ష్మిని దర్శించి ఇలా ప్రార్థించారు.

అమ్మా! జగన్మాతా! భూలోకమంతా రాక్షస మయం అయ్యింది. వాళ్లను పరిమార్చడం నీ చేత మాత్రమే అవుతుంది. ఎవరి తరం కాదు.

ముఖ్యంగా 'శివాలయం' అనీ, 'యక్షాలయం' అనీ, "పద్మావతిపురం" అనీ, 'దక్షిణకాశి' అనీ, ఇలా అనేక పేర్లతో ప్రసిద్ధిపొందిన కరవీరపురాన్ని 'కొల్హాసురుడు' అనే క్రూరుడైన రాక్షసుడు పాలిస్తున్న తీరు మరీ దారుణంగానూ దుర్భరంగాను ఉంది. వీడికంటె ముందు ఈ పట్టణాన్ని పాలించిన "కరవీరుడు" కొల్హాసురుని కొడుకు. ఈ భయంకర రాక్షసుణ్ణి సాక్షాత్తు శివుడే సంహరించాడు. ప్రస్తుతం ఆ క్షేత్రాన్ని కరవీరుని తండ్రి 'కొల్హాసురుడు' పాలిస్తున్నాడు. తల్లీ! నీవు వచ్చి కొల్హాసురుణ్ణి వధించి లోకకల్యాణం ప్రసాదించు అంటూ ప్రార్థించారు మహర్షులు.

అందరి ప్రార్థనలను విన్న శ్రీమహాలక్ష్మి పాతాళం నుండి భూలోకానికి వచ్చింది. కరవీరపురాన్ని చేరుకొని మహాక్రూరుడైన కోల్హాసురునితో తలపడింది. దేవతలందరూ లక్ష్మీదేవికి సహాయంగా వచ్చారు. కొందరు దేవతలు తమ తమ ఆయుధాలను ఇచ్చారు. దేవతలందరి సాయంతో మహాభీకరంగా కోల్హాసురుణ్ణి సంహరించింది. ఆ రాక్షసుడు లక్ష్మీదేవి చేతిలో మరణిస్తూ చివరగా " నా దొక చివరి కోరిక తల్లీ! ఈ పట్నం నా పేరుతో ప్రసిద్ధి పొందాలి. ఈ పట్టణంలో నీవు అర్చారూపంలో నిలిచివుండమని కోరగా, ఆ తల్లి తథాస్తున్నది.

ఆనాటి నుండి అది "కొల్హాపురం" అని పేరును పొందింది. 'అర్చామూర్తి'గా ప్రశస్తి నందిన శ్రీమహాలక్ష్మి 'కోలాసుర భయంకరి' అన్న

బిరుదుతో కీర్తింపబడుతున్నది. అంతకుముందే కోలాసురుని పుత్రుడైన కరవీరునిపేరుతో 'కరవీరపురం' అనికూడ ఈ క్షేత్రం ప్రసిద్ధికెక్కింది.

కొల్హాపురక్షేత్రం కాశీకంటె మహిమాన్వితమైంది. పవిత్రమైంది. కాశీక్షేత్రం కేవలం మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ముక్తిని ఇస్తుంది. కాని 'కరవీరపురం' అనీ, 'కొల్హాపురం' అనీ ప్రసిద్ధి పొందిన ఈ క్షేత్రం ఐశ్వర్యాన్నీ, సమస్త కోరికలనూ ప్రసాదించడంతో పాటు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అంతేకాదు. కాశీక్షేత్రంకంటె కూడ ఈ క్షేత్రం గోధుమగింజంత బరువు ఎక్కువగా వుంటుందట. ఎందుచేతంటే కాశీలో శివుడు మాత్రమే వుండగా కొల్హాపురక్షేత్రంలో శివుడూ, సమస్తదేవతాగణంతోపాటు మహాశక్తి సంపన్నురాలైన 'శ్రీమహాలక్ష్మి' అర్చామూర్తిగా దర్శనమిస్తూవుంది.

ఆనాటినుండి కొల్హాపురం అద్భుతమహిమలతో సిద్ధిక్షేత్రంగా సాధనాక్షేత్రంగా విరాజిల్లుతూ ఉంది. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా వున్న కొల్హాపురంలో శక్తి, 'శ్రీమహాలక్ష్మి' పేరుతో విరాజిల్లుతున్నది.

అష్టాదశ భుజాలతో (18) రౌద్రంగా కోలాసురుణ్ణి సంహరించిన లక్ష్మీదేవి కొల్హాపురంలో నాలుగుభుజాలతో దర్శనమిస్తున్నది. పై రెండు చేతుల్లో గద, డాలు, క్రింది రెండు చేతుల్లో మాతులుంగ ఫలం, పాన పాత్ర ధరించి సింహవాహనారూఢిగా స్థానకమూర్తిగా పశ్చిమాభిముఖంగా దర్శనమిస్తున్నది శ్రీమహాలక్ష్మి!

## లక్ష్మికోసం వెతుకులాట

అలకతో శ్రీమహాలక్ష్మి వైకుంఠాన్ని వీడి వెళ్లడంతో గృహిణి లేని గృహంలాగ చిన్నబోయింది. వైకుంఠం కళావిహీనమై వెలవెలబోయింది. సిరిలేని వైకుంఠంలో శ్రీమహావిష్ణువు పరిస్థితి అధ్వాన్నమై పోయింది.



దుర్భరమైన ఏకాంతాన్ని భరించలేక విష్ణువు లక్ష్మిని వెదుకుతూ భూలోకానికి వచ్చాడు. ఆమెకోసం భూలోకమంతా వెదికాడు. లక్ష్మీ! లక్ష్మీ! అంటూ గట్టిగా అరుస్తూ, అడుగడుగునా, అణువణువునా వెదికాడు. కాని ఆమె జాడమాత్రం ఎక్కడా కూడ కనపడలేదు. లక్ష్మి లేకుండా వైకుంఠానికి తిరిగి వెళ్లకూడదనుకున్నాడు. ఒక వేళ వెళ్ళినా లక్ష్మిలేని వైకుంఠంలో తాను ఉండగలడా! అని ఆలోచించి, ఎలాగైనా ఈ భూలోకంలోనే తానూ కాలం వెళ్లబుచ్చాలని నిర్ణయించాడు సిరి లేని శ్రీనివాసుడు.

అలా తిరుగుతూనే చివరగా ఆదివరాహక్షేత్రానికి చేరుకున్నాడు. ఈ క్షేత్రాన్ని 'శ్వేతవరాహక్షేత్రం' అని కూడా అంటారు. ఈ క్షేత్రంలో ఆకలి దప్పులతో అలమటిస్తూ నిలువ నీడలేక,ఉన్నచోట ఉండలేక, కూర్చున్న చోట కూర్చోలేక నిలుచున్నచోట నిలువలేక కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ వున్న శ్రీనివాసునికి "స్వామిపుష్కరిణి" తీర్థం కనపడింది. ఆ తీర్థానికి దక్షిణాన ఒక పెద్ద చింతచెట్టు, దాని క్రింద పెద్ద పాముల పుట్టా కనపడ్డాయి. ఆ పుట్ట తొర్ర ఒక గుహలా గోచరించింది. అంతే, అందులో తలదాచుకున్నాడు విష్ణుభగవానుడు.

ఎక్కడి శ్రీవైకుంఠం! మరెక్కడి భూలోకంలోని పుట్ట! సాక్షాత్తు వైకుంఠపతి దిక్కూ మొక్కూ లేకుండా పుట్టలో తలదాచుకోవడం, ఆకలికి, దప్పికి అలమటించడం. ఎంతటివాడు ఎలా అయ్యాడో చూశారా!

అఖిలలోకాలలోని సమస్తైశ్వర్యాలకు అధిదేవత అయిన శ్రీ మహాలక్ష్మి ఎక్కడ! పాతాళలోకం లోని మున్యాశ్రమం ఎక్కడ! విధి వైచిత్ర్యం! కారణాలు ఏవైనా, ఎవరిది తప్పైనా, ఒప్పైనా, పరస్పరం సర్దుకపోలేని ఆలుమగల జీవితం ఇలాగే ఉంటుందని, లక్ష్మీ శ్రీనివాసులగాథే మానవాళికి చక్కని ఉదాహరణ!

పాపం! పుట్టలో దాక్కొన్న పరంధాముని దీనావస్థను చూచారు బ్రహ్మదేవుడు, పరమేశ్వరుడు. ఆ ఇద్దరూ, నేరుగా కొల్హాపురం వెళ్లారు. స్వామివారి పరిస్థితిని అంతా లక్ష్మికి వివరించి వెనుకటి ఆలోచనలను, మరచిపోయి ఆయన దగ్గరికి వెళ్లి ఆదుకోమన్నారు. కాని ఆమె ససేమిరా ఒప్పుకొనలేదు. మంకుపట్టు పట్టిన లక్ష్మిని, స్వామివారి ఆకలి దప్పులైనా తీర్చమని ఒప్పించారు. ఇంకేం!

ముగ్గురూ వరాహక్షేత్ర సానువులకు చేరుకున్నారు.

శ్రీమహాలక్ష్మి 'గోపాలిక'గాను, బ్రహ్మదేవుడు 'గోమాత'గాను, శివుడు 'దూడ'గాను మారారు. గోపిక అయిన లక్ష్మీదేవి ఆ ఆవుదూడల్ని ఆ ప్రాంతపు చోళరాజుకు విక్రయించి వెళ్లిపోయింది.

రాజుగారి పసులమందతోపాటు కొత్త ఆవూదూడలు అడవికి మేతకు వెళ్లాక పసులకాపరి కన్నుగప్పి మందనుంచి దూరమయ్యేవి. ఆ తర్వాత అవి వరాహాచలంపైన స్వామిపుష్కరిణి తీరాన చింతచెట్టు క్రిందవున్న పుట్టతొర్రలో పాలుకార్చుతుండేవి. ఆకలితో వున్న శ్రీనివాసుడు ఆవురావురు మంటూ పాలను తాగేవాడు.

ప్రతిరోజూ పుట్టలోని శ్రీనివాసునికి పోస్తున్నందువల్ల ఇంటివద్ద ఆవు పాలు ఇచ్చేది కాదు. ఇలా ఎందుకు జరుగుతోందో తెలుసుకోవాలన్న ఆసక్తితో పసులకాపరి మాటు వేశాడు.

అంతే! మరునాడు కొండపైన పుట్టలో పాలుకారుస్తున్న ఆవును చూచి మండిపడ్డాడు గొల్లవాడు. కోపంతో ఆవుపై తన గొడ్డలిని విసిరాడు. ఆవు బెదిరి పక్కకు తొలగింది. ఈ అలజడికి శ్రీనివాసుడు పైకి లేచాడు. ఇంకేముంది. గొడ్డలి శ్రీనివాసుని నుదుటిన బలంగా తాకి గాయమయింది.



ఉన్నపళంగా ఒక దివ్యపురుషుడు నెత్తురోడుతూ కనపడడంతో గొల్లవాడు దిగ్భ్రమతో మరణించాడు.

ఈ విషయాన్ని తెలుసుకున్న చోళరాజు వెంటనే పరిగెత్తుకు వచ్చి జరిగిన పొరపాటుకు క్షమించమని శ్రీనివాసుణ్ణి వేడికొన్నాడు. చేసిన పాపానికి శిక్ష తప్పదు. అంటూ శ్రీనివాసుడు చోళరాజును పిశాచిగా కమ్మని శపించాడు. ప్రాధేయపడిన రాజుపై కరుణించి త్వరలోనే ఆకాశరాజు తన కూతురు పద్మావతితో తనకు వివాహం జరిగిన వేళలో ఆకాశరాజు కానుకగా తనకు ఒక బంగారు కిరీటాన్ని ధరింపజేసిన వెంటనే శాపవిముక్తి అవుతుందని వరమిచ్చాడు శ్రీనివాసుడు.

ఆ తర్వాత మొట్టమొదటగా తనను దర్శించి, చచ్చిపడివున్న గొల్లవాని సంతతికి కలియుగాంతంవరకు ప్రతిరోజు తొలి దర్శనాన్ని ప్రసాదించాడు శ్రీనివాసుడు.

పిదప శ్రీనివాసుడు వరాహాచలంపై తిరుగుతూ, అక్కడేవున్న వరాహస్వామిని దర్శించాడు. తన కథనంతా దీనంగా విన్నవించుకొని తాను వుండడానికి కొంత స్థలమిమ్మని ప్రాధేయపడ్డాడు. అందుకు ప్రతి ఫలంగా కలియుగంలో తనను దర్శించ వచ్చే యాత్రికులు, వరాహస్వామిని ముందుగా దర్శించాలని, ఆ తర్వాతే తనను దర్శించాలని కట్టడిని ఏర్పాటు చేశాడు శ్రీనివాసుడు. అంతేగాక ప్రతిరోజుతొలిపూజ, తొలినైవేద్యంకూడ వరాహస్వామికే నిర్వహింప బడతాయని కూడా వాగ్దానం చేసిన శ్రీనివాసునికి వుండడానికి నూరు చదరపు అడుగులస్థలాన్ని దానం చేయడంతో పాటు, ఆయనకు సహాయకురాలిగా వకుళమాతను ఏర్పాటు చేశాడు వరాహస్వామి.

ఇక్కడ మనకు కొన్ని సందేహాలు కలుగుతాయి. వరాహస్వామి ఎవరు? వకుళమాత ఎవరు? వరాహస్వామి వకుళమాతనే ఎందుకు

సహాయకురాలిగా శ్రీనివాసునకు ఏర్పాటు చేశాడు? ఈ సందేహాలను తీర్చుకొని ముందుకు సాగుదాం.

## విష్ణువే వరాహస్వామి

చాల ఏళ్లకు పూర్వం!

జలప్రళయం ఏర్పడింది. ఆ అనంతజలరాశిలో లోకాలన్నీ మునిగిపోయాయి. ఇంచుమించు అదే సందర్భంలో హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూమండలాన్ని ఆటబంతిగా చేసుకొన్నాడు. దాంతో ఆడుకొంటూ నానా భీభత్సం చేశాడు. భూదేవి ప్రార్థించగా దేవతలు వేడుకోగా శ్రీమహావిష్ణువు ఆదివరాహంగా తెల్లని స్ఫురద్రూపంతో అవతరించి, తన వాడికోరలతో హిరణ్యాక్షుని సంహరించాడు. అదే కోరలతో భూమిని ఉద్ధరించాడు.

దేవతలందరి కోరికమేరకు ఆదివరాహస్వామి అర్చామూర్తిగా భూదేవితో కూడ ఇక్కడ నిలిచాడు. అదే ఆదివరాహక్షేత్రం, శ్వేతవరాహక్షేత్రం.

ఆ తర్వాత వరాహక్షేత్రాన్ని చేరుకొన్న శ్రీనివాసునికి వరాహస్వామితో పరిచయం ఏర్పడింది. తనను అంతవరకు సేవిస్తున్న వకుళమాతను శ్రీనివాసుని సేవించుటకు నియమించాడు.

## యశోదే వకుళమాత

ద్వాపరయుగం నాటి కథ తెలుసుకుంటే చాలు. ఇప్పటి వకుళమాత కథ తెలుస్తుంది.

చిన్నికృష్ణుణ్ణి పెంచి పెద్ద చేసిన మాతృమూర్తి యశోద! ఆనాడు చిన్ని కృష్ణుడు చూపిన అద్భుతమైన లీలల్ని కనులారా చూచింది. మనసారా ఆనందించింది. ఆశ్చర్యపడింది. అనుభూతి చెందింది యశోద మాతృహృదయం. కాని పెరిగి పెద్దవాడయిన కృష్ణయ్యపెళ్లిని మాత్రం దగ్గరుండి నిర్వహించలేక పోయింది. కనీసం చూచిన భాగ్యం అయినా పొందిందో లేదో పాపం! ఎందుకంటే ద్వారకలో దేవకీ వసుదేవుల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీకృష్ణుని వివాహ వేడుకలను దూరం నుంచే చూచి బాధపడింది. యశోద. దీన్ని గమనించిన శ్రీకృష్ణుడు యశోదను ఓదారుస్తూ "అమ్మా! నేను కలియుగంలో వేంకటాచలంపై శ్రీనివాసునిగా విహరిస్తాను. నీవు అప్పట్లో పరమయోగిని వకుళమాతగా నా సపర్యలు చేస్తావు. అప్పుడు దగ్గరుండి నా పెళ్లి చేసి ఆనందించే భాగ్యం కలుగుతుంది. అంటూ అనునయించాడు ఆనాటి యశోదే ఇప్పటి వకుళమాత!

వకుళమాలిక శ్రీనివాసుణ్ణి తన కన్నబిడ్డలాగా చూసుకుంది. మరొక్కమారు శ్రీనివాసుడు మాతృప్రేమను చవిచూస్తూ తన కష్టాల్ని మరచిపోయాడు.

ఒక రోజు సప్తగిరుల సానువుల్లో తిరుగుతూ వున్న శ్రీనివాసునికి ఆకాశరాజుకూతురు పద్మావతి చెలికత్తెలతో వనవిహారం చేస్తూ కనపడింది.

పద్మావతీ శ్రీనివాసులు పరస్పరం చూసుకొని మోహంలో పడ్డారు. ఇంతలో తేరుకొన్న చెలికత్తెలు పరపురుషుడైన శ్రీనివాసునిపై రాళ్లు విసిరి, వెళ్లిపోయారు. నెత్తురు కారుతున్న గాయాలతో శ్రీనివాసుడు ఇంటికెళ్లాడు. జరిగిన కథనంతా వకుళమాలికకు చెప్పి ఆమెను పెళ్లి చేసుకుంటానంటాడు శ్రీనివాసుడు. మహారాజైన ఆకాశరాజు కూతురెక్కడ! కొండల్లో వుండే మన మెక్కడ! ఇద్దరికీ పొంతన ఎలా కుదురుతుంది? అని సందేహాన్ని వెలిబుచ్చిన వకుళమాతతో శ్రీనివాసుడు అన్నాడు.

ఆమె ఎవరో కాదు. ఒకప్పటి వేదవతే ఇప్పటి పద్మావతి!

ఈ మాట వినగానే వకుళమాత ఆశ్చర్యపడింది. ఆనందపడింది. శ్రీనివాసుడు త్రేతాయుగంనాటి కథను ఇలా వివరించాడు.

## వేదవతే పద్మావతి

రామావతారవేళ!

సీతారామలక్ష్మణులు పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేస్తున్న సమయం! రావణాసురుడు సీతను అపహరించి లంకకు ఎత్తుకెళ్లాడు. ఆ సమయంలో అగ్నిదేవుడు రావణాసురునికి ఎదురుపడ్డాడు. రావణా! నీవు ఎత్తుకెళ్తున్న స్త్రీ, సీతాదేవి కానే కాదు. అసలు సీత నా దగ్గర ఉంది. అంటూ తన దగ్గర తన సంరక్షణలో వున్న "వేదవతి" అనే మాయాసీతను చూపించాడు. అగ్ని దేవునిమాటలు నమ్మిన రావణాసురుడు సీతను అగ్నిదేవునికి ఇచ్చి, ఆయన దగ్గరున్న 'వేదవతి'ని తీసుకెళ్లాడు.

రావణ వధానంతరం, రాముడు సీత పవిత్రతను నిరూపించి చూపడానికై అగ్నిలో ప్రవేశింప చేశాడు. ఆ సమయంలో అగ్నిగుండం నుండి సీత రూపంలో వున్న ఇద్దరు స్త్రీలు బయటికి వచ్చాడు.

ఆశ్చర్యపోయిన శ్రీరామచంద్రునితో అగ్నిదేవుడు ప్రత్యక్షమై రామచంద్రా! ఇంతవరకు లంకలో వున్నది 'వేదవతి'. అసలు సీత నాదగ్గర ఉండింది అన్నాడు. ఆ తర్వాత సీతాదేవి, రామునికి 'వేదవతి'ని చూపుతూ, నా బదులుగా లంకలో కష్టాలుపడ్డ ఈ 'వేదవతి'ని వివాహమాడు అని అడుగుతుంది.

"ఈ అవతారంలో ఏకపత్నీవ్రతుణ్ణి. కలియుగంలో వేంకటాచలపతిగా అవతరించిన వేళలో, ఈ వేదవతి ఆకాశరాజు కూతురుగా "పద్మావతి" పేరుతో జన్మిస్తుంది, ఆ సమయంలో పెళ్ళి చేసుకుంటానని రాముడు వరమిచ్చాడు. ఇదిగో అప్పటి వేదవతే ఇప్పటి పద్మావతి! అని స్పష్టపరుస్తాడు శ్రీనివాసుడు.



సరే బాగుంది. కాని వేదవతి ఎవరు? అని వకుళమాత సందేహ పడుతుంది.

## లక్ష్మీదేవే వేదవతి

పూర్వం మయుడు అనే వేదపండితుడు వుండేవాడు. ఆ బ్రాహ్మణుడు నిరంతరం వేదాలను వల్లె వేస్తూ వుండేవాడు. ఒకసారి అలా వేదాలను చదువుతూ చదువుతూ ఉండగా 'ఊర్వశి' అనే అప్సరస కంటపడింది. ఆమె అందానికి భ్రమించాడు. ఆ సమయంలో కామవశుడైన మయునికి ఇంద్రియ పతనం అయింది. అందులో నుండి 'లక్ష్మీదేవి' శిశువుగా పుట్టింది వేదం చదువుతూ వుండగా జన్మించింది కనుక 'వేదవతి' పేరుతో పెంచి పెద్ద చేశాడు ఆ విప్రుడు. తర్వాత వేదవతి విష్ణువునే వివాహమాడాలని తపస్సు చేసింది. అలాగ తపస్సు చేస్తున్న సందర్భంలో రావణాసురుడు ఆమెను బలాత్కరించబోయాడు. వెంటనే వేదవతి నేను విష్ణువును తప్ప ఎవరినీ వివాహమాడను అంటూ, యోగాగ్నిలో ఆహుతి అయింది. అగ్నిని చేరుకొన్న ఆ వేదవతి ఆనాటినుండి అగ్నిదేవుని సంరక్షణలో వుండింది. అగ్నిదేవుడు తనదగ్గరున్న ఈ 'వేదవతి'ని సీతగా రావణునికి ఇచ్చి, అసలు సీతను తన దగ్గర ఉంచుకున్నాడు. అప్పటి ఆ వేదవతే ఇప్పుడు ఈనాడు ఆకాశరాజు కూతురు 'పద్మావతి'గా పుట్టింది.

ఈ వివరాలన్నీ వకుళమాత శ్రీనివాసుని ద్వారా విని ఆనందపడింది.

త్రేతాయుగం నాటి మాట ప్రకారం పద్మావతిని వివాహ మాడవలసి వున్నదని శ్రీనివాసుడు అన్నాడు. ఆయన కోరిక మేరకు వకుళమాత,

ఆకాశరాజు దగ్గరికి వెళ్లి పద్మావతీ శ్రీనివాసుల వివాహానికి మధ్యవర్తిత్వం నిర్వహించింది.

## శ్రీనివాసకల్యాణం

వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారం పూర్వఫల్గుణీ నక్షత్రం కూడిన శుభప్రదమైన ముహూర్తంలో వివాహం నిశ్చయం అయ్యింది.

శ్రీనివాసునివైపు అష్టదిక్పాలకాది సమస్త దేవతాగణం వేంచేసింది. ఈ సందర్భంలో ఈ పెళ్లిలో శ్రీమహాలక్ష్మి ఒక్కతి మాత్రమే లేదు. ఆమె వస్తే బాగుంటుందని శ్రీనివాసుడు చాల బాధ పడ్డాడు. ఈయన బాధను గమనించి బ్రహ్మాది దేవతలు సూర్యభగవానుణ్ణి రప్పించారు. కొల్హాపురం వెళ్లి మహాలక్ష్మిని పిలుచుకరమ్మని పంపించారు. ఆత్రుతగా సూర్యుని వెంటవచ్చిన లక్ష్మీదేవి, భూలోకంలో ఒంటరిగా లేకుండా శ్రీనివాసుడు వివాహమాడుతున్నందులకు సంతసించింది. తానే దగ్గరుండి తన స్వామిని "పెండ్లికొడుకు"ను చేసి పద్మావతితో వివాహం జరిపించింది. ఆకాశరాజు రాజధాని నారాయణ వరంలో పద్మావతీ శ్రీనివాసుల పరిణయం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం శ్రీనివాసుడు ఎంత బతిమాలినా వినక, మళ్లీ లక్ష్మీదేవి కొల్హాపురానికి వెళ్ళిపోయింది.

## కొల్హాపుర యాత్ర

నూతన వధూవరుల కొత్తజీవితం కొంతకాలం బాగానే సాగింది. కాని ఏదో తెలియని, వ్యక్తం చెయ్యలేని అశాంతి, వెలితి కలిగాయి. దాన్ని గూర్చి ఆలోచించాడు శ్రీనివాసుడు. శ్రీమహాలక్ష్మి వచ్చినట్లే వచ్చి వెళ్లిపోవడమే దానికి కారణం. అని అర్థం చేసుకొన్న శ్రీనివాసుడు పద్మావతిని, వకుళమాతకు అప్పజెప్పి, శ్రీమహాలక్ష్మిని తానే స్వయంగా పిలచుకరావడానికి కొల్హాపురక్షేత్రానికి వెళ్లాడు.



## ఆకాశవాణి

కొల్హాపురానికి వెళ్లిన శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మి సందర్శనం కోసం పలువిధాలుగా ప్రయత్నం చేశాడు. కాని ఆయమ్మ దర్శనం కాలేదు. సుమారు పదేండ్లపాటు మహాలక్ష్మిని గూర్చి కొల్హాపురంలో తపస్సు చేసిన శ్రీనివాసునికి చివరకు ఒక అశరీరవాణి వినిపించింది.

"ఓ శ్రీనివాసా! నీకు ఇక్కడ ఈ క్షేత్రంలో మహాలక్ష్మి దర్శనం కానే కాదు. నీవు వేంకటాచలక్షేత్రానికి తిరిగి వెళ్లు. ఆ పుణ్యక్షేత్రానికి దక్షిణ దిక్కున సువర్ణముఖీనదీతీరంలో శ్రీశుకమహర్షి ఆశ్రమం ఉంది. ఆ ప్రాంతంలో ఒక పద్మసరోవరాన్ని నిర్మించు. ఆ సరోవర తీరాన నీవు లక్ష్మీదేవిని గూర్చి తపస్సు చేస్తే, ఆమె దర్శనం తప్పక అవుతుంది".

## శ్రీనివాసుని తపస్సు

ఆకాశవాణి పలుకులకు ఆశ్చర్యపడిన శ్రీనివాసుడు శుకమహర్షి ఆశ్రమ ప్రాంతానికి చేరుకొన్నాడు. అక్కడ పద్మ సరోవరాన్ని నిర్మించాడు. దాని తీరాన సూర్యభగవానుణ్ణి ప్రతిష్ఠించాడు. అక్కడ తీవ్రంగా శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మికోసం నిరాహారంగా పన్నెండేండ్లపాటు తపస్సు చేశాడు.

బ్రహ్మాది దేవతలు భృగుమహర్షి మున్నగువారు శ్రీమహాలక్ష్మి దగ్గరకు వెళ్లి శ్రీనివాసుని తపస్సును గూర్చి చెప్పి ఇక జాగు చేయక లోకకల్యాణం కోసం శ్రీనివాసుణ్ణి చేరమని ప్రార్థించారు.

''అమ్మా! సిరులతల్లివైన శ్రీమహాలక్ష్మీ! నిన్నూ, శ్రీనివాసుని అగౌరవపరచాలన్న ఉద్దేశం ఏమాత్రం లేదు తల్లీ! లోకక్షేమం కోసం అలా చెయ్యవలసి వచ్చింది. అయినా శ్రీవారి వక్షఃస్థలంలో తన్నడం క్షమించరాని తప్పు. తల్లీ! శ్రీవారి మహిమను, నీయొక్క అపారమైన కరుణను లోకానికి

తెలియ జెయ్యాలన్న సంకల్పంతో నేను చేసిన ఆ తప్పిదాన్ని క్షమించి శ్రీనివాసుణ్ణి చేరు" అని భృగుమహర్షి ప్రార్థించాడు.

అవును! నేను చేసిన తొందరపాటు నిర్ణయంవల్ల ఇన్ని వేల యేండ్లు ఎడబాటు పొందవలసి వచ్చింది. అంటూ అందరినీ అనునయించింది. తప్పక ఆ స్వామిని చేరుకుంటానని మాట ఇచ్చింది లక్ష్మి.

## అలమేలుమంగ అవతరణ

ఒకానొక కార్తికమాసంలో శుక్ల పంచమీ శుక్రవారం. ఉత్తరాషాఢా నక్షత్రం కూడిన శుభప్రదమైన విజయలగ్నంలో. శ్రీమహాలక్ష్మి, శ్రీనివాసుని ఎదుట పద్మసరోవరంలో సహస్రదళాలు కలిగిన బంగారుపద్మంలో అవతరించింది. ఆ శుభవేళలో నలుదెసలా మంగళప్రదంగా శంఖనాదాలూ, భేరీలు, మృదంగ శబ్దాలూ వినవచ్చాయి.

బంగారుపద్మంలో పద్మాసనియై పద్మహస్తగా పద్మమాలాలంకృత అయిన నిత్య యౌవన శోభితురాలైన శ్రీమహాలక్ష్మి, పదహారేళ్ల నవయువతిగా అవతరించింది.

బంగారుపద్మంలో బంగారు వర్ణంలో ప్రకాశిస్తున్న 'పద్మావతి'ని బ్రహ్మేంద్రాది దేవతలు, భృగునారద, తుంబురాది మహర్షులు... ఎంద రెందరో ఎన్నోవిధాలుగా కీర్తించారు. స్తుతించారు.

తన ఎదుట ఇన్నాళ్లకు ఇన్నేళ్లకు ప్రత్యక్షమైన శ్రీమహాలక్ష్మిని చూస్తూ శ్రీనివాసుడు ఆనందపడుతూ తన మెడలోని కల్హారమాలను ఆమె కంఠంలో వేసి, ఆమెను ఆలింగనం చేసికొన్నాడు. ఆ సందర్భంలో పూలవానలు కురిసాయి. దేవ దుందుభులు మోగాయి. ఆధ్యాత్మిక చైతన్యంతో వెల్లివెరిసిన



ఆ మంగళమైన ఆ శుభసమయాన బ్రహ్మాది దేవతలు పెక్కువిధాలుగా స్తుతించారు.

**ఓం నమశ్శ్రియై లోకధాత్ర్యై బ్రహ్మమాత్రే నమో నమః**
**నమస్తే పద్మనేత్రాయై పద్మముఖ్యై నమో నమః**

**ప్రసన్నముఖపద్మాయై పద్మకాంత్యై నమో నమః**
**నమో బిల్వవనస్థాయై విష్ణుపత్న్యై నమో నమః**

**విచిత్ర క్షౌమధారిణ్యై పృథుశ్రోణ్యై నమో నమః**
**పక్వబిల్వ ఫలాపీన తుంగస్తన్యై నమో నమః**
**సురక్త పద్మ పత్రాభ కరపాదతలే శుభౌ**
**సురత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితే**

**యక్ష కర్దమ సంలిప్త సర్వాంగే కటకోజ్జ్వలే**
**మాంగల్యాభరణై శ్చిత్రైః ముక్తాహారై ర్విభూషితే**

**తాటంకై రవతంసైశ్చ శోభమాన ముఖాంబుజే**
**పద్మహస్తే నమస్తుభ్యం ప్రసీద హరివల్లభే**
**ఋగ్యజుస్సామరూపాయై విద్యాయై తే నమో నమః**

**ప్రసీదాస్మాన్ కృపాదృష్టిపాతై రాలోకయాబ్ధిజే**
**యే దృష్టా స్తే త్వయా బ్రహ్మ రుద్రేంద్రత్వం సమాప్నుయుః**

అని పరిపరి విధాలుగా స్తుతించిన దేవతలను, ఉద్దేశించి లక్ష్మీదేవి "భక్తులారా, మీరు చేసిన ప్రార్థనలు నాకు చాల సంతోషాన్ని కలిగించాయి. ఈ స్తోత్రాన్ని పఠిస్తూ నన్ను బిలువదళాలతో ఎవరు అర్చిస్తారో, వారు పోగొట్టుకున్న సంపదలను పదవులను తిరిగి పొందడమేగాక, ఇంకా ఇంకా అభివృద్ధిని పొందుతారు. అంతేకాదు ధర్మ అర్థ కామ మోక్షాలను పురుషార్థాలు సిద్ధిస్తాయి.

నేను ఆవిర్భవించిన ఈ పద్మసరోవరంలో శుభముహూర్తవేళ సంకల్పం చెప్పుకొని స్నానం చేసిన తర్వాత ఈ స్తోత్రాన్ని పఠిస్తే చాలు. దీర్ఘాయుష్షుతో పాటు, ఐశ్వర్యాన్ని తేజోవంతులైన సంతానాన్ని పొందుతారు. అంటూ వరాలను ఇబ్బడి ముబ్బడిగా ప్రసాదించింది.

అందుకు దేవతలందరూ పరమసంతోషంతో అమ్మా! జగన్మాతా! సువర్ణపద్మంలో ఆవిర్భవించిన నిన్ను పద్మజ, పద్మాలయ, పద్మాసని, పద్మహస్త, పద్మావతి, అలమేలుమంగ... ఇలా అనేక పేర్లతో కీర్తిస్తున్నాం తల్లీ! అంటూ సాష్టాంగ ప్రణామాలు చేశారు.

అందరికీ వరాలను ప్రసాదించిన అలమేలుమంగమ్మను శ్రీనివాసుడు ఆలింగనం చేసుకొన్నాడు. వెంటనే ఆ దివ్యజనని అదృశ్యమై శ్రీనివాసుని వక్షః స్థలంలో "వ్యూహలక్ష్మి"గా ఆవిర్భవించింది. ఆనాటి నుండి "ద్విభుజా వ్యూహలక్ష్మీ" అన్నట్లు రెండు చేతుల్లో పద్మాలను ధరించి పద్మాసనంలో కూర్చున్న భంగిమలో శ్రీనివాసుని హృదయంలో దర్శనమిస్తున్నది. ఆయన వక్షఃస్థలంలో ఈ తల్లి వేంచేసివున్నందువల్ల ఆస్వామి 'శ్రీనివాసుడు'గా ప్రసిద్ధిని పొందాడు.

వెంటనే బ్రహ్మాది దేవతలు శ్రీనివాసభగవానుని ఇలా అడిగారు. స్వామీ! శ్రీనివాసా! జగజ్జనని పద్మావతి, నీవల్ల అవతరించింది కదా! నిన్ను చేరిందికదా! మరి ఇంత అద్భుతమైన సంఘటన జరిగిన ఈ దివ్యస్థలంలో అమ్మవారు 'అర్చామూర్తి'గా భక్తులకు దర్శనమిస్తూ ఆనందింపజేస్తే బాగుంటుందంటూ ప్రార్థించారు.

వెంటనే స్వామివారు, అమ్మవారు ఇద్దరూ ఒక్కసారిగా తథాస్తు! అని వరమిచ్చారు. అంతేకాదు. పద్మావతి అవతరించిన ఈ కార్తీకశుక్ల పంచమినాటికి గుర్తుగా ప్రతిఏటా కలియుగాంతం వరకు అంగరంగ



వైభవంగా ఉత్సవాలు, జరుపబడతవి అంటూ వరమిచ్చారు. అందువల్లే ఆనాటినుండి శ్రీపద్మావతిఅమ్మవారు వెలసివున్న తిరుచానూరు క్షేత్రంలో "స్వతంత్ర వీరలక్ష్మి" పేరుతో ప్రసిద్ధి పొంది. తిరుమలలో శ్రీనివాసస్వామికి ఉత్సవాలు ఎంతవైభవంగా జరుగుతవో అలాగే అంగరంగవైభవంగా స్వతంత్రంగా జరుగుతున్నవి. ఆనాడే బ్రహ్మదేవుడు, పద్మసరోవరానికి ఆగ్నేయమూలలో శుకమహర్షి చేత అర్చింపబడుతున్న శ్రీబలరామకృష్ణుల సన్నిధికి పక్కన స్వతంత్రవీరలక్ష్మి (విరహాలక్ష్మి)ని ప్రతిష్ఠించినాడు. ఇక్కడ ఈ క్షేత్రంలో కేవలం మహారాజ్ఞి అయిన పద్మావతికి మాత్రం శ్రీనివాసుడు లేకుండానే పాంచరాత్రాగమపద్ధతిని స్వతంత్రంగా ఉత్సవాలు, ఊరేగింపులు జరుగునట్లుగా కూడ బ్రహ్మదేవుడు ఏర్పాట్లు చేసినాడు. అంతేగాక పద్మసరోవరంలో పద్మావతి అమ్మవారు అవతరించిన నాటికి అవబృథం జరుగునట్లుగా బ్రహ్మదేవుడు ఉత్సవాలు నిర్వహించినాడు. అవబృథం రోజున అనగా పంచమిరోజు ఉత్సవాలు పరిసమాప్తమయ్యే నాటికి సరిగ్గా ముహూర్త వేళకు తిరుమల క్షేత్రంనుండి శ్రీనివాసుని కంఠంలోని పూలమాల, పసుపుకుంకుమలు, చీరసారె, పిండివంటలు, శ్రీశుకపురంలోని అలమేలుమంగమ్మ వచ్చునట్లు శాశ్వతంగా కట్టడి చేయబడింది.

ఇలా ఆనాడు బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన తర్వాత బ్రహ్మాదిదేవతలు వారి వారి లోకాలకు వెళ్ళిపోగా శ్రీనివాసుడు వక్షఃస్థల వ్యూహలక్ష్మితో తిరుమలక్షేత్రం చేరుకున్నాడు. అప్పటికే తిరుమలలో వున్న ఆకాశరాజుకూతురు పద్మావతి (వేదలక్ష్మి)ని శ్రీనివాసుడు "వ్యూహలక్ష్మి"తో విలీనంచేసుకున్నాడు.

సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఏడుకొండలు దిగి వచ్చి తపస్సు చేసిన దివ్యస్థలం తిరుచానూరు. కొన్ని రోజులు క్షీరపానం చేస్తూ, మరి

కొన్ని రోజులు నిరాహారంగా పన్నెండేండ్ల పాటు తపస్సు చేసి శ్రీమహాలక్ష్మి దయకు పాత్రుడు కావడమేగాక, శ్రీనివాసుడు భక్తులందరికీ ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని చెప్పకనే తెలియజేస్తున్నాడు.

ఆనాటి నుండి శ్రీపద్మావతిఅమ్మవారు అటు తిరుమలక్షేత్రంలో శ్రీనివాసుని వక్షఃస్థలంలో "వ్యూహలక్ష్మి" గాను, ఇటు తిరుచానూరులో అర్చామూర్తి రూపంలో, స్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి, అలమేలుమంగ, వంటి పేర్లతో ప్రసిద్ధియై భక్తులను ఆదుకుంటున్నది. ఆనందపెడుతున్నది. వారు కోరిన కోరికలన్నింటిని తన స్వామి అయిన కొండలరాయని చేత వరాలను ప్రసాదింపజేస్తున్న వరప్రసాదిని ఈ అలమేలుమంగ!!

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు తపస్సు చెయ్యగా సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి తిరుచానూరులోని పద్మసరోవరంలో బంగారు పద్మంలో ఆవిర్భవించిందని తెలుసుకున్నాం కదా!

మరి అలాంటి పరమ పవిత్రమైన పద్మపుష్కరిణిని ఆ తర్వాతకాలంలో ఎవరైన సేవించి తరించారా? పాపాలు పోగొట్టుకున్నారా?

అంటే! ఔను. అని చెప్పవలసి వుంటుంది. అందుకు తార్కాణంగా ఒక వృత్తాంతాన్ని కూడ చెప్పుకోవచ్చు.

## పద్మసరోవర మహిమ

చాల పూర్వం జరిగిన అద్భుతమైన గాథ!

తిరుచానూరులోని పద్మసరోవరం మహిమను తెలియజేసే ఆశ్చర్యమైన వృత్తాంతం!

పూర్వం కాంభోజరాజ్యం వుండేది. అది పెట్టు సిరులకు పుట్టినిల్లు! పాడి పంటలకు ఆలవాలం! భుజబలసంపన్నులకు పెట్టిందిపేరు. విద్యలకు,



పద్మసరోవరం – పంచమీతీర్థ (చక్రస్నానం) దృశ్యం



స్నపనతిరుమంజనంలో శ్రీ పద్మావతి అమ్మవారు



అరవైనాలుగు కళలకు కాణాచి! అలాంటి సుసంపన్నమైన కాంభోజరాజ్యాన్ని ఒకానొక కాలంలో 'శంఖణుడు' అనే రాజు పాలించాడు.

శంఖణమహారాజు కన్నతండ్రివలె అందరికి అన్నివేళల్లో అందుబాటులో వుండేవాడు. ఎంతటి పరాక్రమవంతుడో అంతటి భోళాశంకరుడు. ప్రజల కష్టసుఖాలను మరీ అడిగి అడిగి తెలుసుకొనేవాడు. తెలుసుకొని వాటిని పరిష్కరించేవాడు. అయితే ఆ రాజు అందరు చెప్పినవి మరీ చెవి యొగ్గి వినే వాడు. సులువుగా నమ్మేవాడు. నమ్మడం కూడా కొద్దిగా కాదు. మరీ జాలిగుండె ఆ రాజుగారిది. అందువల్ల ఎవరు ఏవేళ అడిగినా లేదనకుండా ఇచ్చేవాడు. దానాలకు ధర్మాలకు లెక్కే లేదు. అంతూ పొంతూ లేదు.

కనపడినవాణ్ణి నమ్మడం, చెప్పినవన్నీ వినడం, విన్నవన్నీ అతిగా నమ్మడం ఆ శంఖణుడికి పుట్టుకతో అబ్బిన బలహీనత! ఇన్ని బలహీనతలున్న వాణ్ణి ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా సులువుగా మోసం చెయ్యవచ్చు. మోసం చేశారుకూడా! శంఖణుడు కొందరు అనుకూల శ్రతువులచేత సులభంగా మోసగింపబడ్డాడు. దాంతో తన రాజ్యాన్ని సర్వస్వం పోగొట్టుకొన్నాడు. రాజ్యాన్ని వదలిపెట్టి చివరకు అడవులపాలయ్యాడు.

ఇది లోకసహజం! అతిగా నమ్మితే మోసం చెయ్యడం సర్వసాధారణం. అలా నమ్మినవాణ్ణి మోసగించవచ్చా, అది న్యాయమా అన్యాయమా! అన్న సందేహ పరంపరలకు తావే లేదు. అది అంతే!

రాజు పరిస్థితిని చూచి ప్రజలు బాధపడ్డారు జాలిపడ్డారు. పాపం అంతకంటె వాళ్లు మాత్రం ఏం చెయ్యగలరు.

రాజ్యాన్ని పోగొట్టు కొన్న శంఖణుడు కట్టుబట్టలతో మాత్రం మిగిలాడు. తన అవివేకానికి, అతిమంచితనానికి చింతించాడు. "చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం" అంటే ఇదేనేమో! చేసేది ఏమీలేక ఆ రాజు

భార్యతోపాటు అడవులకు బయలుదేరాడు. కాలుగాలిన పిల్లివలె అరణ్యాల్లో తిరుగుతూ వుండినాడు.

శంఖణుడు తన పరిస్థితికి తనే జాలిపడేవాడు. నిరాశానిస్పృహలకు లోనవుతూ చింతించేవాడు. ఉన్నచోట వుండలేక, కూర్చున్నా స్తిమితంగా కూర్చోలేక, నిలుచున్నా ఒక చోట నిలువలేక, పండుకొన్నా నిద్రరాక, ఇలా చాల అవస్థలు పడ్డాడు. ఇలా రాత్రీ పగలు అన్న తేడా లేకుండా తిరుగుతున్న శంఖణుడికి ఒక ఆలోచన వచ్చింది. ప్రాణత్యాగం చేసుకుంటే బాగుంటుందని. ఇంకేమి? ఈ ఆలోచన వచ్చిందే తడవు. భార్యకు చెప్పాడు. పాపం ఆ ఇల్లాలు బావురుమని ఏడ్చింది? కోటిదేవతలను వేడి కొంది. తమను రక్షించమని.

“స్వామీ! గోవిందా! ఆపన్నరక్షకా! ఆదుకోవయ్యా! అంటూ గొంతెత్తి బిగ్గరగా ఏడ్చింది”.

ఆర్తితో, ఆర్ద్రతతో పిలిస్తే భగవంతుడు తప్పక పలుకుతాడు అంటారు పెద్దలు. దయామయుడు కదా దేవుడు. వారి ప్రార్థన విన్నాడు కాబోలు!

సరిగ్గా అదేవేళకు ఆ దారిలో కొందరు మహనీయులు వెళుతూ వీళ్లకు తారసపడ్డారు. ఆ సాధువులు, మంచి తేజస్సుతో వున్నారు. ఎవరో మునీశ్వరులు! తపోమూర్తులైన ఆ ఋషుల కాళ్లమీద పడ్డారు. శంఖణ రాజదంపతులు! తమను రక్షించమని తమకు ఏదో మార్గం చూపించమని పరిపరి విధాల వేడుకొన్నారు.

ఆ రాజదంపతుల ఆక్రందనను విన్న ఋషులందరు పలువిధాల పరీక్షించారు.

రాజదంపతులారా! ప్రస్తుతం గ్రహబలం సరిగాలేదు. అందువల్లే ఈ కష్టాలు కలిగాయి. ఇవి కలకాలం వుండవుగాక! మరి కష్టం దాపురించిన



ఈ దుష్టవేళల్లో అడవుల్లో చింతిస్తూ తిరిగేకంటే క్షేత్రాల్ని సందర్శించండి. తీర్థాల్లో మునగండి! ఆ యా దేవతలను ఆరాధించండి! అప్పుడు మీ కర్మ పరిపాకం తగ్గుతుంది. త్వరలోనే మీ రాజ్యం మీకు సంప్రాప్తమవుతుంది. ఇక ఆలస్యం చెయ్యకుండా క్షేత్ర సందర్శనలు, తీర్థ స్నానాలు చెయ్యండి. మీకు మంచి దవుతుందని చెప్పి ఆశీర్వదించి వెళ్లిపోయారు ఆ యోగులు.

ఇంకేముంది. ఆ మహనీయుల సందర్శనం, సంభాషణంతో వారి మనస్సులు తేలికపడ్డాయి. వారు ఆదేశించినట్లు క్షేత్ర సందర్శనకు బయలుదేరారు, శ్రీరంగం, మధుర, కన్యాకుమారి, పళని, తిరుత్తణి, కంచి, ...ఇలా క్షేత్రాలన్నీ చూస్తూ, ఆ యా తీర్థాల్లో మునుగుతూ అక్కడి దేవతల్ని దర్శిస్తూ చివరకు వేంకటాచలపర్వత సానువులకు వచ్చి చేరుకొన్నారు.

అక్కడికి దగ్గర్లో సువర్ణముఖీనదీతీరంలో వెలసివున్న దక్షిణకాశీ, శ్రీకాళహస్తీశ్వరక్షేత్రాన్ని సందర్శించారు. ఆ నదిలో సంకల్పం చెప్పుకొని స్నానాలు చేసి, శ్రీజ్ఞానప్రసూనాంబా శ్రీకాళహస్తీశ్వరులను దర్శనం చేసుకొని కాస్త విశ్రాంతి తీసుకున్నారు.

అదే సమయంలో వారి దగ్గరికి ఒక మహనీయుడైన ఒక వ్యక్తి వచ్చి ఇలా అన్నాడు.

రాజ దంపతులారా! ఇక్కడికి అతి సమీపంలోనే స్వర్ణముఖీ నదీతీరంలో ఒక అద్భుతమైన సరస్సువుంది. ఆ సరోవరంలో శ్రీవేంకటేశ్వరుని కోరికమీద సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి సహస్రదళాలు కలిగిన బంగారుపద్మంలో అవతరించింది. ఆ జగన్మాత ఆ సరస్సు ఒడ్డునే “పద్మావతి” “అలమేలుమంగ” అనే పేర్లతో ప్రసిద్ధి చెంది దర్శనమిస్తున్నది. మీరిరువురూ అక్కడికి వెళ్లండి! ఆ పద్మసరోవరంలో స్నానమాడండి. అమ్మ అలమేలుమంగమ్మను దర్శించి ప్రార్థించండి.

శ్రీవేంకటేశ్వరుని దయరూపమే ఆ తల్లి! మీ మీ ప్రార్థనల్ని చక్కగా వింటుంది. విని మీకు మేలు చేస్తుంది. వెళ్లిరండి అంటూ ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు ఆ మహాత్ముడు.

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో కనపడినట్లే కనపడి మహోపదేశం చేసి అదృశ్యమయిన ఆ మహనీయుని మనసారా స్మరిస్తూ బయలుదేరి శుకమహర్షి ప్రాంతంలోని పద్మసరోవరాన్ని చేరుకొన్నారు.

ఆ దివ్య సరస్సులో పద్మాలు నిండివున్నాయి. వాటిపైన తుమ్మెదలు ఝుమ్మంటూ తిరుగాడుతుండగా అత్యంత మనోహరంగా కనపడుతున్న ఆ పద్మసరస్సును సాక్షాత్తు శ్రీనివాసుడు ప్రతిష్ఠించినాడట! అంతేకాదు. ఆ స్వామి శ్రీమహాలక్ష్మి అనుగ్రహం కోసం, దర్శనం కోసం, ఆ సరస్సు ఒడ్డున పన్నెండేండ్లపాటు తపస్సు చేశాడంట! శ్రీనివాసుడు కేవలం పాలను స్వీకరిస్తూ కొంతకాలం, నిరాహారంగా కొంతకాలం శ్రీమహాలక్ష్మి మంత్రాన్ని జపిస్తూ తపస్సు చెయ్యగా ఆ పద్మసరస్సులో కార్తికమాసం శుక్లపంచమినాడు బంగారుపద్మంలో లక్ష్మీదేవి అలమేలుమంగగా అవతరించిందంట! అలా పద్మంలో అవతరించినందువల్ల 'పద్మావతి' గా 'అలమేలుమంగ'గా పిలువబడిన ఆ తల్లి, శ్రీవేంకటేశ్వరుణ్ణి చేరుకొందంట! అంతేకాక బ్రహ్మేంద్రాది దేవతలమేరకు ఆ తల్లి ఇక్కడ పద్మాసనస్థయై అర్చామూర్తిగా దర్శనమిస్తున్నదంట! ఇలా ఆ శంఖణరాజదంపతులు ఒకరికొకరు ముచ్చటించుకొంటూ ఆ పద్మసరస్సుకు నమస్కరిస్తూ, అందులో మునక లిడినారు. సంకల్పపూర్వకంగా భక్తిప్రపత్తులతో ప్రణామాలర్పించి, స్నానాలు చేశారు. అలమేలుమంగమ్మను కనులారా దర్శించి పూజించారు. ఆ సందర్భంలో శ్రీ పద్మావతిఅమ్మవారిని, వేంకటేశ్వరుని వేయివిధాలుగా ప్రార్థించారు.



**నారాయణస్య హృదయే భవతీ యథాస్తే**
**నారాయణోఽపి తవ హృత్కమలే యథాస్తే**
**నారాయణస్త్వమపి నిత్యముభౌ తథైవ**
**తౌ తిష్ఠతాం హృది మమాపి దయావతీ శ్రీః**

అమ్మా! జగన్మాతా! అలమేలుమంగా! శ్రీమన్నారాయణుడయిన శ్రీవేంకటేశ్వరుని వక్షఃస్థలంలో నీవు వుంటావు! నీ హృదయంలో పరంధాముడైన ఆ శ్రీనివాసస్వామి ఉంటాడు. మీరు ఉభయులిద్దరూ కలిసి మా అంతరంగ హృదయాల్లో నిండుదయతో కొలువై వుందురు గాక!!

ఇలా అనేక విధాలుగా ప్రార్థించి, ప్రార్థించి, అలసి సొలసి పోయినారు. అలసట వల్ల కొద్దిగా కళ్లుమూసుకున్నాడు శంఖణరాజు. ఇంతలో అతనికి మగతనిద్ర ఆవహించింది. ఆ నిద్రలో ఒక మహనీయుడు కనపడ్డాడు.

శంఖణ చక్రవర్తీ! నీవు నీ భార్యతో కూడ పవిత్రమైన ఈ పద్మసరోవరాన్ని దర్శించినందువల్లా, అందులో మునకలిడినందువల్లా మీ పాపాలు అన్నీ నశించిపోయాయి. ఇంతటితో మీ కష్టాలు తొలగిపోయాయి. ఓ రాజా! సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అయిన పద్మావతిని దర్శించిన మహద్భాగ్యం వల్ల – మీ మీ పాపాలు మహా కాలాగ్నిలో పడిన దూదిపింజవలె భస్మమయ్యాయి. స్ఫుటం పెట్టిన బంగారంవలె ఒక దివ్య తేజస్సు నిన్ను ఆవరించింది.

ఇక మీ దంపతులు ఇరువురూ నన్ను అనుసరించండి అంటూ, వారిద్దరిని సప్తగిరుల క్షేత్రమైన వేంకటాచలానికి పిలుచుక వెళ్లాడు. దారిలో కొండలు, గుట్టలు, తీర్థాలు, జలపాతాలు, ఎన్నో కనపడ్డాయి. ఎందరో ఋషులు, పరమయోగులు కనపడ్డారు. చివరకు కొండమీద సర్వపాపహరిణి అయిన స్వామిపుష్కరిణి దగ్గరికి తీసుకెళ్లి, అందులో స్నానం చేయించాడు.

తర్వాత ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యమూల విరాణ్మూర్తిని, ఆయన వక్షఃస్థలంలోని "వ్యూహలక్ష్మి"ని దర్శింపజేశాడు. రాజా! ఇంతకు ముందే కదా పద్మసరోవర తీరాన "స్వతంత్రవీరలక్ష్మి"గా దర్శనమిస్తున్న పద్మావతిని దర్శించారుకదా! అక్కడ అర్చామూర్తిగ వున్న ఆ జగన్మాత ఇక్కడ వేంకటాచలక్షేత్రంలో శ్రీస్వామివారి వక్షఃస్థలంలో "వ్యూహలక్ష్మి"గా కొలువైవుంటున్నది. "వ్యూహలక్ష్మి"ని అన్ని వేళల్లో అందరూ దర్శించడానికి వీలు పడదు. అందువల్ల శుకపురంలోని అర్చామూర్తిని అందరూ అన్నివేళల్లో దర్శించవచ్చు. అంటూ శ్రీనివాసుని వక్షఃస్థలమహాలక్ష్మి దర్శనంతో పోయిన రాజ్యం మీకు వస్తుందని అంటుండగా, ఇంతలో పద్మసరోవరతీరంలో మగత నిద్రలోవున్న శంఖణరాజదంపతులకు మెలకువ కావడంతో ఆశ్చర్యపోయినారు.

స్వప్నాదేశం ప్రకారం, ఆ రాజదంపతులు తిరుచానూరులోని పద్మసరస్సులో మరోమారు స్నానంచేసి, అలమేలుమంగను దర్శించి తిరుమలకు వెళ్లారు. అక్కడ శ్రీస్వామి పుష్కరిణిలో స్నానమాచరించి, ఆనందనిలయుని, ఆయన వక్షఃస్థలంలోని వ్యూహలక్ష్మిని దర్శించి ఇష్టార్థాలను పొందారు. రాజ్యలాభంతోపాటు సమస్తైశ్వర్యాలను పొంది సుఖించారు. చివరకు ముక్తిని పొందారు.

* * *

## తిరుచానూరుక్షేత్రం

తిరుపతి పట్టణానికి సరిగ్గా ఆగ్నేయమూలలో సుమారు మూడుమైళ్ల దూరంలో నెలకొన్న క్షేత్రం 'తిరుచానూరు'. ఇదే 'అలమేలుమంగపట్నం' అనే పేరుతో పిలవబడుతున్నదని తెలుసుకున్నాం.



తిరుపతి ఆర్.టి.సి బస్‌స్టాండు నుంచి మంగపట్నానికి ప్రతి 5 నిమిషాలకు బస్సులు ఉన్నాయి. ఇవి గాక ఆటోల్లో 20 నిమిషాల వ్యవధిలో తిరుచానూరు చేరుకోవచ్చు.

* * *

## పద్మసరోవరం

తిరుచానూరులో, ప్రవేశించిన వెంటనే చతురస్రాకారంగా వున్న విశాలమైన పద్మసరోవరం మనకు దర్శనమిస్తుంది. సమృద్ధిగా వున్న పుణ్యతీర్థ జలాలతో అద్దంలా మెరుస్తూ అందంగా కనపడుతూ ఆనందింపజేస్తుంది పద్మపుష్కరిణి!

తూర్పుగట్టున వున్న పెద్ద పెద్ద మఱ్ఱి, రావి మానుల నీడలను, అలాగే చుట్టూవున్న భవంతుల నీడలను ప్రతిబింబింపజేస్తూ, నయన మనోహరంగా దర్శనమిస్తున్న ఈ పద్మసరోవరం అందమైన దృశ్యం అక్షర నిక్షిప్తం చెయ్యడం కష్టం. ప్రత్యక్షంగా చూసి ఆనందిస్తేనే బావుంటుంది.

ఈ పుష్కరిణి నట్టనడిమధ్యలో శ్రీచక్రమేరువులాగా నీళ్లలో తేలియాడుతూ నీళ్లలో ప్రతిబింబిస్తూవున్న 'నీరాళి మండపం' అదిగో! అలనాడు ఆనందాలకు పెన్నిధిగా, ఆనందనిలయుని పట్టపుదేవేరిగా శ్రీపద్మావతి అమ్మవారు అవతరించిన దివ్యస్థలానికి సంకేతంగా నిలిచిందేమో! అన్నట్లుగా ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లుతున్న పద్మసరోవరంలోని నీరాళిమండపం!

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఏడుకొండలు దిగి ఇంతదూరం వచ్చి స్వయంగా తవ్విన పుష్కరిణి ఇది! ఇందులో దేవలోకం నుంచి తెప్పించిన పద్మాలను ప్రతిష్ఠించినాడు. అవి అన్ని వేళల్లో వికసించి వుండడానికి వీలుగా సూర్యభగవానుణ్ణి కూడా శ్రీనివాసుడు ప్రతిష్ఠించాడు. ఈ సూర్యభగవానుని ఆలయం పుష్కరిణికి తూర్పుగట్టున వుంది. అందరూ చూడవచ్చు.



పద్మసరోవరం (తిరుచానూరు)



చక్రస్నానానికి సిద్ధమైన శ్రీ పద్మావతి అమ్మవారు



ఈ పుష్కరిణి గట్టున కొన్నేండ్లు గోక్షీరం సేవిస్తూ, మరికొన్ని ఏండ్లు నిరాహారంగా శ్రీనివాసుడు తపస్సు చెయ్యగా ఇందులోనే బంగారు పద్మంలో అవతరించింది 'పద్మావతి' అని పిలువబడుతున్న అలమేలుమంగమ్మ!

ఈ జగన్మాత అవతరించిన కార్తీక శుద్ధపంచమినాటికి గుర్తుగా ప్రతి సంవత్సరం పదినాళ్లపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. చివరిరోజున అనగా ఆమె అవతరించిన పంచమినాడు "పంచమితీర్థం" అనే పేరుతో చక్రస్నానం జరుగుతుంది.

ఈ 'పంచమి తీర్థం'నాడు తిరుమల శ్రీస్వామివారి నుంచి చీర, సారె, పసుపుకుంకుమ, పిండివంటలు కాలినడకన తీసుకవచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. ఆ పసుపుకుంకుమలతో పద్మసరోవరతీరాన. పద్మావతి అమ్మవారికి, సుదర్శనభగవానునికి స్నపన తిరుమంజనం జరుపబడుతుంది. పిదప సుదర్శన భగవానునికి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. ఈ చక్రస్నానంతోపాటు లక్షలాదిమంది భక్తులు కూడ పవిత్ర స్నానాలు చేస్తారు. ఈ చక్రస్నానంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి.

### తెప్పోత్సవాలు

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో పున్నమినాటికి పూర్తి అయ్యేట్లుగా ఐదురోజులపాటు సాయంత్రవేళల్లో ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతవి.

మొదటిరోజు శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామికి, రెండవరోజున శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీసుందరరాజస్వామివారికి, చివరి మూడురోజులు శ్రీ పద్మావతి అమ్మవారికి తెప్పోత్సవం జరుపబడుతుంది.

విద్యుద్దీపాల వెలుగుల్లో, మంగళవాద్యాలు, వేదమంత్రాల ఘోషలు హృదయంగమంగా సాగుతుండగా నయనమనోహరంగా పద్మసరోవర జలాల్లో జరిగే తెప్పోత్సవం వర్ణనాతీతం!

## వైకుంఠద్వాదశి

ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో వైకుంఠఏకాదశి మరునాడు వైకుంఠద్వాదశినాటి ప్రాతఃకాలాన శ్రీసుదర్శన భగవానునికి పద్మసరోవరంలో చక్రస్నానం జరుగుతుంది. ఈ సమయంలో కూడ భక్తులు పవిత్ర స్నానాలు చేస్తారు.

## పవిత్రోత్సవంలో చక్రస్నానం

శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రతిసంవత్సరం భాద్రపద పున్నమికి పూర్తి అయ్యేట్లుగా మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతవి. చివరిరోజున శ్రీసుదర్శన భగవానునికి ఈ పద్మసరోవరంలో చక్రస్నానం జరుగుతుంది.

ఇదీ అలనాడు ఆనందనిలయుడు స్వయంగా ప్రతిష్ఠించిన పద్మసరోవర దివ్య చరిత్ర!

ఈ పద్మావతిఅమ్మవారి తెప్పోత్సవాలు, పంచమితీర్థం వంటి ఆ యా ఉత్సవాల్లో సేవలందిస్తూ, దర్శనం, స్పర్శనం, స్నానంమాత్రం చేతనే భక్తులందరి పాపాలను పోగొడుతూ పవిత్రులను చేస్తూవున్న శ్రీపద్మ సరోవరం అదిగో! నతమస్తకులమై ప్రణామాలను సమర్పించి ముందుగా ఈ పుష్కరిణి తూర్పుతీరానవున్న శ్రీసూర్యనారాయణస్వామిని దర్శించినతర్వాత, శ్రీ పద్మావతి ఆలయంలో ప్రవేశించుదాం రండి!

**ఓం శ్రీపద్మావత్యై నమః**

* * *



## శ్రీ సూర్యనారాయణస్వామి గుడి (తిరుచానూరు)

తిరుచానూరు క్షేత్రంలో వెలసిన ప్రాచీనమైన ఆలయం శ్రీ సూర్య నారాయణస్వామివారి గుడి. పద్మసరోవరానికి తూర్పుతీరాన సుమారు 20 అడుగుల దూరంలో పశ్చిమాభిముఖంగా ఈ ఆలయం నెలకొని ఉంది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వున్న ఈ గుడిలోని సూర్యభగవానుని నిలువెత్తు నల్లని శిలావిగ్రహమూర్తిని సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రతిష్ఠించినాడని పురాణ ప్రసిద్ధి.

శ్రీవేంకటేశ్వరుడు శ్రీమహాలక్ష్మీదేవి అనుగ్రహం కొరకు కొల్హాపుర క్షేత్రానికి వెళ్లాడు. కాని అక్కడ ఆమె దర్శనం ఎంతటికీ కాలేదు. ఇంతలో ఒక అశరీరవాణి ఇలా విన్పించింది.

"ఓ శ్రీనివాసా! ఇక్కడ నీకు మహాలక్ష్మి దర్శనం సిద్ధించదు. వేంకటా చలానికి సమీపంలో సువర్ణముఖీ తీరాన ఒక పద్మసరోవరాన్ని స్థాపించి, అక్కడ శ్రీమహాలక్ష్మిని గూర్చి తపస్సు చెయ్యి. నీ కోరిక తప్పక నెరవేరుతుంది" అని వెంటనే శ్రీనివాసుడు ఇక్కడికి వచ్చాడు. ముందుగా సరోవరాన్ని నిర్మించాడు. అందులో దేవలోకం నుంచి తెప్పించిన పద్మాలను నాటినాడు. అవి ఎప్పుడు వికసించి వుండడం కోసం కమలబాంధవుడైన సూర్యుణ్ణి ప్రతిష్ఠించినాడు. సుమారు 12 ఏండ్లపాటు తీవ్రమైన తపస్సు చేయగా, శ్రీమహాలక్ష్మి, అదే పద్మసరోవరంలో సహస్ర దళాలు కలిగిన బంగారు పద్మంలో "అలమేలుమంగ"గా అవతరించింది.

అందువల్ల ఈ భాస్కరక్షేత్రం అప్పటిది. ఆనాటిది. ముఖమండపం, అర్థమండపం గర్భాలయం అని ఈ ఆలయం నిర్మితమై వుంది.

పశ్చిమముఖంగా వున్న ముఖ మండపంలో తూర్పు గోడపై ప్రవేశద్వారానికి కుడివైపున నేలకు ఆనుకొని ఒక శిలాఫలకం వుంది.

దానిపై లిఖింపబడిన శాసనంలో నూతనంగా నిర్మింపబడిన దేవాలయంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి విగ్రహం ప్రతిష్ఠింపబడినట్లు తెలుపబడింది. ఆ శాసనం ఇది.

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకారంభం 1788 అగునేటి అక్షయ నామ సంవత్సర నిజజ్యేష్ఠ శుద్ధ నవమి శుక్రవారమునకు సరి అయిన 1866 సంవత్సరం ఏప్రిల్ నెల 23 తారీఖున శ్రీహరి గురుభక్తి పరాయణులయిన మహారాజశ్రీ హథీరాంజీమఠం శ్రీమహంతు సేవాదాసుజీవారి శిష్యులయిన ధర్మదాసుజీ మహంతువారివల్ల నూతనంగా తయారు చేయించబడిన దేవస్థానములో శ్రీ సూర్యనారాయణస్వామివారిని ప్రతిష్ఠ చేయడమైనది. "శుభమస్తు".

పై శాసనంలో నూతనంగా నిర్మింపబడిన దేవాలయం అని తెలుపబడింది. కాని అందులో శ్రీసూర్యనారాయణస్వామివారి విగ్రహం అంతకుముందు వున్న పాత విగ్రహమా! లేక విగ్రహం కూడా కొత్తదా? అన్న విషయాలు స్పష్టంగా తెలియరావడం లేదు.

ఏది ఏమైనప్పటికీ కాలాంతరంలో ఈ క్షేత్రంలోని ప్రాచీనమైన శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయం ఎప్పటికప్పుడు పునరుద్ధరింపబడుతున్నట్లుగా భావించవచ్చును.

ముఖమండపాన్ని దాటిలోనికి ప్రవేశిస్తే విశాలమైన పొడవైన అర్ధమండపం కనపడుతుంది. ఈ అర్ధమండపం గర్భాలయానికి ప్రదక్షిణా పథంగా కూడా ఉపయోగపడుతున్నది. భక్తులు అర్ధమండపంలో భక్తులు నిలబడి గర్భాలయంలోని శ్రీసూర్య భగవానుని దర్శించవలయును.

అర్ధమండపంలో తూర్పువారకు ప్రదక్షిణా పథం కలిగి నిర్మింపబడిన 8'×8' కొలతలు గల గర్భాలయంలో పశ్చిమాభిముఖంగా శ్రీసూర్య



నారాయణస్వామివారి నిలువెత్తు శిలావిగ్రహం స్థిరంగా ప్రతిష్ఠింపబడింది. ద్విభుజిగా విరాజిల్లుతున్న ఈ స్వామివారి రెండు చేతుల్లోను కమలాలను ధరించివున్నాడు. విగ్రహంలో కిరీటం, మెడ కంఠహారాలు, యజ్ఞోపవీతం, కరకంకణాలు, మలచబడి వున్నాయి. పద్మపీఠంపైన నిలిచివున్న (స్థానక) మూర్తి అయిన ఈ విగ్రహానికి నడుమునుంచి పాదాలవరకు అంగవస్త్రం (ధోవతి) చెక్కబడింది. పాదాలకు కూడా కడియాలున్నాయి. గర్భాలయంపైన ఏక కలశ గోపురం నిర్మింపబడివుంది. ఈ ఆలయం పునర్నింపబడి, కొత్తగా కనపడుతున్నప్పటికీ ఆలయంలోని రాతిస్తంభాలు, మూలమూర్తిని పరిశీలించినట్లయితే చాలా ప్రాచీనమైనదిగానే తోస్తుంది.

ఈ గర్భాలయంలో మూలమూర్తితో పాటు సుమారు 3.5 అడుగుల ఎత్తుగల శ్రీ సూర్యనారాయణస్వామివారి పంచలోహ ఉత్సవమూర్తి మరియు 1.5 అడుగుల భోగమూర్తి ప్రతిమలు మూలమూర్తికి నకలు ప్రతిమలుగా చోటుచేసుకున్నాయి.

ఈ ఆలయానికి ధ్వజస్తంభంగానీ, బలిపీఠంగానీ లేవు.

వైఖానస శాస్త్ర ప్రకారంగా పూజాదికాలు నిర్వహింపబడుతున్న శ్రీ సూర్యనారాయణస్వామివారికి ప్రతిరోజు మూడుపూటలా అర్చనలు నివేదనలు జరుగుతున్నాయి.

ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీ సూర్యనారాయణస్వామివారి మూలమూర్తికి అభిషేకం నిర్వహింపబడుతుంది. ఈ అభిషేకంలో వరుసగా ఆవుపాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనం మున్నగు ద్రవ్యాలను ఉపయోగిస్తారు. అభిషేకానంతరం చక్కెర పొంగలిని నివేదిస్తారు. ఈ అభిషేక సేవలో నిర్ణీత ఆర్జితరుసుమును చెల్లించి భక్తులు పాల్గొనవచ్చును.

అంతేగాక శ్రీ సూర్యనారాయణస్వామివారి అవతార నక్షత్రమైన హస్త నక్షత్రం కూడిన రోజున అనగా నెలకు ఒక్కసారి స్వామివారి ఉత్సవమూర్తికి ఏకాంతంగా అభిషేకం నిర్వహించబడిన తర్వాత పొంగలి నివేదింప బడుతుంది. ఆ సాయంత్రం తిరుచానూరు పురవీధుల్లో శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తికి పల్లకిపై గ్రామోత్సవం నిర్వహింపబడుతుంది.

సంవత్సరంలో ప్రధాన పర్వదినములైన మకర సంక్రమణ రోజున, రథసప్తమినాడు శ్రీసూర్యనారాయణస్వామివారి మూలమూర్తికి, ఉత్సవ మూర్తికి ఘనంగా అభిషేక, అర్చన నివేదనలు జరుగుతాయి, గ్రామోత్సవాలు నిర్వహింపబడతవి.

ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో నెలరోజులపాటు తెల్లవారు జామున 5 గంటలకు ధనుర్మాస పూజలు జరుపబడి పొంగలి నివేదన చేయబడు తుంది.

శ్రీనివాసుని అవతార కథా ఘట్టంలో సూర్య భగవానునికి అత్యంత ప్రాధాన్యత ఉంది.

శ్రీనివాసుడు ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడు సమయంలో కొల్హాపుర మహాలక్ష్మికి, శ్రీనివాసునికి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరించినాడు. శ్రీస్వామివారి ఆదేశం మేరకు సూర్యుడు స్వామి తరపున కొల్హాపురానికి వెళ్లి శ్రీ మహాలక్ష్మిని ఆహ్వానించి, పిలుచుక వచ్చినాడు.

అలాగే తిరుచానూరులో సాక్షాత్తుగా శ్రీ వేంకటేశ్వరునిచే ప్రతిష్ఠింపబడిన స్వామి శ్రీ సూర్యనారాయణుడు. శ్రీనివాసుని కోరిక మేరకు పద్మసరోవరంలో ఎల్లప్పుడు సువర్ణ పద్మాలు వికసించి వుండేట్లుగా సూర్య భగవానుడు



కొలువై వుండినాడు. తద్వారా శ్రీమహాలక్ష్మి సహస్రదళాలు కలిగిన బంగారు పద్మంలో అలుమేలు మంగగా, పద్మావతిగా అవతరించుటకు ప్రధాన కారణభూతుడైనాడు. ఆనాటి నుండి తిరుచానూరు భాస్కరక్షేత్రమై విలసిల్లింది.

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారితో పాటు సాక్షాత్తు తిరుమలేశుని చేత ప్రతిష్ఠింపబడి అర్చింపబడిన శ్రీ సూర్యనారాయణస్వామిని భక్తులు దర్శించడం, శ్రేయోదాయమేగాక తిరుమలయాత్ర సంపూర్ణ ఫలప్రదం అవుతుంది కూడా.

**శ్లో॥ ఆదిదేవ! నమస్తుభ్యం**
**ప్రసీద మమ భాస్కర!**
**దివాకర! నమస్తుభ్యం**
**ప్రభాకర నమోఽస్తు తే!!**

* * *

## శ్రీ పద్మావతిఅమ్మవారి ఆలయప్రాంగణం

ఏడు బంగారుకలశాలతో గంభీరంగా తూర్పుముఖంగా కనపడే ఎత్తైన రాజగోపుర ద్వారానికి లోపల ప్రాంగణంలో ఎదురుగా ఉన్న ఆలయం శ్రీకృష్ణస్వామి స్వామిఆలయం. ఈ ఆలయానికి ఒకవైపున అనగా దక్షిణంవారకు శ్రీసుందరరాజస్వామిఆలయం, మరోవైపున అనగా ఉత్తరంవారకు శ్రీ పద్మావతిఆలయం నెలవైవున్నాయి. ఈ ఆలయాలు అన్నింటిలోను పాంచరాత్రాగమం ప్రకారంగా మూడుపూటలా పూజలు నివేదనలు నిర్వహింపబడుతున్నాయి.

## శ్రీ పద్మావతిఅమ్మవారి ఆలయం

ప్రధానంగా శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయాన్ని ఊంజల్‌మండపం, ధ్వజస్తంభమండపం, ముఖమండపం, అర్థమండపం, అంతరాళం, గర్భాలయం అని ఆరుభాగాలుగా పరిశీలించవచ్చు.

**ఆశీర్వాదమండపం:**

ధ్వజస్తంభమండపానికి తూర్పున సుమారు 4 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపై నిర్మింపబడిన 16 రాతిస్తంభాల మండపమే ఊంజల్ మండపం. చాల పూర్వం, ఈ మండపం మధ్యలో వున్న వేదికలో అలమేలుమంగమ్మకు డోలోత్సవం జరుపబడేది. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం కొలువు మేళాలు (భజంత్రీ) వాయింపబడుతున్నాయి.

ఇంకా, ప్రముఖులు అమ్మవారి దర్శనానంతరం ఈ మండపంలో కూర్చుని తీర్థప్రసాదాలను ఆశీర్వాదాన్ని స్వీకరిస్తుంటారు.

**ధ్వజస్తంభ మండపం:**

ఒక వరుసకు ఆరుస్తంభాలవంతున ఆరు వరుసలతో మొత్తం 36 రాతిస్తంభాల ఎత్తైన మండపం మధ్యలో బంగారుబలిపీఠం, దానికి



పశ్చిమంగా ఆనుకొని వున్న బంగారుధ్వజస్తంభం వుండడంచేత ఈ మండపం ధ్వజస్తంభమండపం అని పిలువబడుతున్నది.

అమ్మవారికి నివేదనలు జరిగిన మూడుపూటల చివర్లో ఆలయాన్ని అంటి పెట్టుకొన్న భూతగణాలకు శుద్ధాన్నం బలిగా ఈ పీఠంపైన సమర్పింపబడుతుంది. కనుక ఇది బలిపీఠం. దీనికి ఆనుకొని ఎత్తైన బంగారు ధ్వజస్తంభం వుంది. అమ్మవారికి ఎదురుగా ఈ స్తంభంలో కింది భాగంలో పశ్చిమాభిముఖంగా గజవాహనం, ఉత్తరదక్షిణవైపున శంఖచక్రాలు, తూర్పుముఖంగా శ్రీపద్మావతిఅమ్మవారి ప్రతిమ ఇలా నలువైపులా ఈ ధ్వజస్తంభంపై ప్రతిష్ఠింపబడినాయి.

ప్రతిసంవత్సరం కార్తీకమాసంలో జరిగే బ్రహ్మోత్సవ ప్రారంభంలో ఈ బంగారు ధ్వజస్తంభంపైన గజపతాకం ఎగుర వేయబడుతుంది. బ్రహ్మోత్సవానంతరం చివర్లో, ఈ ధ్వజం అవరోహణ జరుపబడుతుంది.

**కల్యాణోత్సవమండపం:**

అమ్మవారి ధ్వజస్తంభమండపానికి దక్షిణంగా, శ్రీ బలరామకృష్ణస్వామి ఆలయానికి ముందు భాగంలో వున్న కల్యాణ మండపంలో శ్రీ పద్మావతీ శ్రీనివాసులకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం జరుగతుంది.

**ముఖమండపం:**

శ్రీ పద్మావతిఅమ్మవారి ప్రధాన ఆలయానికి ముందుభాగంలో చుట్టూ ఇనుపకటాంజనంతో మధ్యలో నాలుగుస్తంభాలమధ్యలో ఎత్తైన రాతి వేదికతో విరాజిల్లుతున్న మండపమే ముఖమండపము. శ్రీపద్మావతి అమ్మవారికి ఈ మండపంలో ఆస్థానాలు, కొలువులు జరుగుతుంటాయి.

**అర్థమండపం:**

ముఖమండపం దాటి లోనికి వెళితే వుండేదే అర్థమండపం. ఇది గర్భాలయానికి ప్రదక్షిణామండపంగా కూడ ఉపయోగపడుతున్నది. ఈ అర్థమండపంలో గర్భాలయానికి ముందు భాగంలో దక్షిణవారకు ఉత్తరాభిముఖంగావున్న రాతి అరలో సుదర్శన భగవానుని, విష్వక్సేనులవారి పంచలోహవిగ్రహాలువున్నాయి. వీటితో పాటు విష్వక్సేనలవారు, గరుత్మంతులవారి శిలావిగ్రహాలు ప్రతిష్ఠింపబడివున్నాయి. అలాగే ఉత్తరం వారకు దక్షిణాభిముఖంగావున్న రాతి అరలో శ్రీభగవద్రామానుజులవారి శిలామూర్తితో పాటు, పంచలోహమూర్తి కూడ ప్రతిష్ఠింపబడివున్నాయి.

**అంతరాళం:**

అర్థమండపం దాటి లోనికి వెళితే వుండే మండపమే అంతరాళం. ఈ అంతరాళంలో ప్రవేశించే ద్వారాన్ని ఇరువైపులా ఉండే అమ్మవారి సేవికలు వనమాలిని, బలాకిని కాపలా కాస్తుంటారు.

ఈ అంతరాళంలో శ్రీపద్మావతిఅమ్మవారి పంచలోహ ఉత్సవమూర్తితో పాటు శ్రీపద్మావతి శ్రీనివాసుల భోగమూర్తుల విగ్రహాలు కూడ చోటుచేసుకున్నాయి.

**గర్భాలయం:**

అంతరాళం దాటిన తర్వాత గర్భాలయంమధ్యలో పద్మపీఠంపై, కూర్చొన్న భంగిమలో శ్రీ పద్మావతి అమ్మవారి శిలామూర్తి ప్రతిష్ఠింపబడింది.

చతుర్భుజి అయిన అమ్మవారికి పై రెండు చేతుల్లో పద్మాలు వున్నాయి. క్రింది కుడి, ఎడమ చేతులు వరుసగా అభయ వరదముద్రలు కలిగి దర్శనమిస్తున్నది.



'అలమేలుమంగ' అని పిలువబడుతున్న పద్మావతిఅమ్మవారి మూలమూర్తికి ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, సహస్రనామార్చన అనే కుంకుమార్చన, నివేదన జరుపబడతవి. భక్తులు సర్వదర్శనవేళల్లో కూడ ఈ తల్లికి 'కుంకుమార్చన' నిర్వహించుకోవచ్చు. ఇదిగాక ప్రతిసోమవారం 'అష్టదళపాదపద్మారాధన', ప్రతి గురువారం 'తిరుపావడసేవ' ప్రతి శుక్రవారం 'అభిషేకం' ప్రతి శనివారం 'పుష్పాంజలి' సేవ అమ్మవారి మూలమూర్తికి నిర్వహింపబడతాయి.

**శాంతినిలయవిమానం**

శ్రీ పద్మావతి అమ్మవారి గర్భాలయంపైన "శాంతినిలయవిమానం" అనే పేరుతో బంగారు కవచంతో ఏక కలశ గోపురం నిర్మింపబడింది. ఈ బంగారు విమానంపైన అష్టలక్ష్ముల విగ్రహమూర్తులు అష్టదిక్కుల్లో ప్రతిష్ఠింపబడినందువల్ల ఈ అష్టలక్ష్ముల సమన్వయసమాహార రూపమే ఈ అలమేలుమంగ! అన్ని కోరికలను తీర్చగల సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి! అని స్పష్టమవుతున్నది.

విశేషంగా శాంతినిలయ విమానంమీద వాయవ్యమూలలో విలసిల్లే "విమానలక్ష్మి"గా కూడ దర్శనమిస్తున్నది అలమేలుమంగ! ఈ శాంతినిలయం మీది "విమానపద్మావతి" తిరుమలకొండవైపు చూస్తున్నట్లుగా దర్శనమిస్తూ శ్రీనివాసుని స్మరింపజేస్తుంది.

శ్రీ పద్మావతిఅమ్మవారికి పాంచరాత్రాగమం ప్రకారంగా ఏడాది పొడవునా నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు ఎన్నెన్నో వైభవంగా జరుపబడుతుంటాయి. తిరుమల యాత్రికులతో, భక్తులతో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం. కోలాహలంగా సందడిగా అలరారుతూ వుంటుంది.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవాలు

దివ్యక్షేత్రమైన తిరుచానూరులో పవిత్రమైన పద్మసరోవర పుణ్యజలాల నుండి బంగారు సహస్రపద్మంలో ఆవిర్భవించిన అలమేలుమంగమ్మకు పద్మావతి అనే పేరుతో పాటుగా "స్వతంత్ర వీరలక్ష్మి" అనే మరోపేరు ప్రసిద్ధంగా వుంది.

తిరుమల స్వామివారికి వైఖానసాగమశాస్త్ర రీతిగ స్వతంత్రంగా షట్కాలార్చనలు ఉత్సవాలు, ఊరేగింపులు జరుగుతున్నట్లుగా, తిరుచానూరులో శ్రీమహారాజ్ఞి అయిన పద్మావతి అమ్మవారికి పాంచరాత్రాగమ శాస్త్రరీతిగా "స్వతంత్ర వీరలక్ష్మ్యారాధన" పేరుతో నిత్యారాధనలు, ఉత్సవాలు ఊరేగింపులు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీనివాసుని పట్టపురాణి అయిన పద్మావతికి తిరుమలేశుని మాదిరిగానే స్వతంత్రంగా జరుగుతున్న సేవలను క్లుప్తంగా తెలుసుకుందాం.

### నిత్యోత్సవాలు:

ప్రతిరోజు విధిగా జరిగే నిత్యోత్సవాలు అంటారు. ప్రతిరోజు ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై వరుసగా శ్రీపద్మావతి అమ్మవారి మూలమూర్తికి సహస్రనామార్చన, జరిగిన తర్వాత – నివేదన జరుగుతుంది. "పద్మావతి పరిణయం" పేరుతో శ్రీపద్మావతీశ్రీనివాసులకు నిత్య కల్యాణోత్సవం, ప్రతి సాయంత్రం అమ్మవారికి డోలోత్సవం (ఊంజల్‌సేవ) జరుగుతవి. రాత్రి "ఏకాంతసేవ"తో ఆలయ కార్యక్రమం పూర్తి అవుతుంది. సర్వదర్శనవేళల్లో భక్తులు అమ్మవారి మూలమూర్తికి కుంకుమార్చన చేయించుకోవచ్చు.

### వారోత్సవాలు :

వారానికి ఒకరోజు ప్రత్యేకమైన ఉత్సవం విధిగా జరుగుతుంది. ఈ సేవల్లో భక్తులు నిర్ణీత ఆర్జిత రుసుమును చెల్లించి పాల్గొనవచ్చు.



సోమవారం – అష్టదళపాద పద్మారాధన, గురువారం – తిరుప్పావడ (అన్నకూటోత్సవం) మూలమూర్తికి జరుగుతవి.

### అభిషేకం :

శుక్రవారం – అమ్మవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహింపబడుతుంది.

### లక్ష్మీపూజ :

ప్రతిశుక్రవారం కల్యాణోత్సవానికి ముందుగా కల్యాణ మండపంలో "లక్ష్మీపూజ" జరుగుతుంది.

### తోట ఉత్సవం :

ప్రతి శుక్రవారంనాడు నిత్యకల్యాణం తర్వాత అమ్మవారు గుడికి దక్షిణ దిక్కులో వున్న శుక్రవారపు తోటకు వెళ్లిన తర్వాత మధ్యాహ్నం 3 గంటల వేళలో ఆ తోటలో పసుపు, చందనం మున్నగు ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. ఈ అభిషేకాన్ని భక్తులు అందరూ దర్శించవచ్చు.

### ఊంజల్‌సేవ :

ప్రతిరోజు ఆస్థానమండపంలో ఊంజల్‌సేవ జరుగుతుంది. ఈ సేవ జరిగిన తర్వాత ప్రతి శుక్రవారం మాత్రమే ఊరేగింపుగా గ్రామోత్సవం జరుగుతుంది.

### పుష్పాంజలిసేవ :

ప్రతి శనివారం ఉదయం 6.30 గం॥లకు పుష్పాంజలి సేవగా పద్మాలతో మూలమూర్తికి పుష్పార్చన జరుగుతుంది.

**నక్షత్రోత్సవాలు:**

ప్రతి నెలా ఉత్తరాషాఢ, ఏకాదశి రోజుల్లో అమ్మవారి ఉత్సవమూర్తికి ఏకాంతంగా అభిషేకం జరుగుతుంది. ఉత్తరాషాఢా నక్షత్రం రోజు సాయంత్రం శ్రీపద్మావతిఅమ్మవారికి గజవాహనోత్సవం జరుపబడుతుంది.

**సంవత్సరోత్సవాలు:**

ప్రతి సంవత్సరం ఉగాది రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ ముఖమండపంలో ఉగాది ఆస్థానంరోజున పంచాంగశ్రవణం జరుగుతుంది.

**వసంతోత్సవాలు :**

వైశాఖమాసం పూర్ణిమకు, మూడురోజులపాటు అమ్మవారికి వసంతోత్సవాలు జరుగుతవి చివరిరోజు పున్నమిరోజున స్వర్ణరథోత్సవం జరుగుతుంది.

**తెప్పోత్సవాలు :**

జ్యేష్ఠమాసం పూర్ణిమకు పూర్తి అయ్యేట్లుగా ఐదురోజులపాటు తెప్పోత్సవాలు జరుగుతాయి. మొదటిరోజున ఏకాదశినాడు శ్రీకృష్ణస్వామికి, రెండవరోజు ద్వాదశిరోజున శ్రీ సుందరరాజస్వామికి చివరి 3 రోజులు, శ్రీపద్మావతిఅమ్మవారికి పద్మ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతాయి.

**పవిత్రోత్సవాలు :**

ప్రతి సంవత్సరం భాద్రపద మాసం పున్నమనాటికి పూర్తి అయ్యేట్లుగా 3 రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి.



**బ్రహ్మోత్సవాలు :**

ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ పంచమికి పూర్తి అగునట్లు, పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతవి. ప్రతిరోజు, ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో మహారాజ్ఞి అయిన పద్మావతి అమ్మవారికి మాత్రమే వాహనసేవలు జరుగుతాయి.

చివరిరోజున పంచమిరోజున పద్మసరోవరంలో వేలాదిమంది భక్తులమధ్య జరిగే పంచమి తీర్థవేడుకలతో బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి.

**లక్షకుంకుమార్చన :**

బ్రహ్మోత్సవాలు ప్రారంభమగుటకు ముందు రోజున పద్మావతి అమ్మవారికి లక్షకుంకుమార్చన సేవ జరుగుతుంది.

**పుష్పయాగం :**

బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన మరునాడు శ్రవణనక్షత్రం రోజున ఆలయంలోనే శ్రీపద్మావతిఅమ్మవారికి వివిధరకాల సుగంధ పుష్పాలతో "పుష్పయాగం" ఘనంగా జరుగుతుంది.

**తైమాసంలో ప్రత్యేకపూజలు :**

ప్రతి సంవత్సరం పుష్యమాసంలో (అరవనెల తైమాసంలో) ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా అమ్మవారికి పూజలు జరుగుతాయి. సుమంగళులకు పసుపుదారాలు ప్రసాదంగా పంచబడతాయి.

శ్రీనివాసభగవానుని పట్టపుదేవేరి అయిన పద్మావతిఅమ్మవారు అర్చామూర్తిగా వేంచేసి వున్న తిరుచానూరుక్షేత్రం అంగరంగ వైభవంగా ఉత్సవాలతో, ఊరేగింపులతో ఏడాదిపొడవునా ఆ తల్లి ఉత్సవవైభవాన్ని

వర్ణించడం సాధ్యంకాదు. ప్రతిభక్తుడు తిరుమలను సందర్శించే ముందు పద్మసరోవరాన్ని దర్శించడం స్పృశించడం, స్నానం చెయ్యడం విధిగా ఆచరించాలి. తర్వాత శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకొన్న తర్వాతనే తిరుమలకు వెళితే తమయాత్ర సంపూర్ణంగా సిద్ధిస్తుంది.

**శ్లో॥ మాతస్సమస్తజగతాం మధుకైటభారేః**
**వక్షోవిహారిణి మనోహర దివ్యమూర్తే**
**శ్రీస్వామిని శ్రితజన ప్రియదానశీలే**
**శ్రీవేంకటేశదయితే తవ సుప్రభాతమ్**

* * *



## తిరుచానూరు శ్రీ బలరామకృష్ణస్వామి ఆలయం (అళగియ పెరుమాళ్)

తిరుచానూరు శ్రీ పద్మావతిఅమ్మవారి ఆలయప్రాంగణంలో అతి ప్రాచీనమైన శ్రీబలరామకృష్ణస్వామివారి ఆలయం నెలకొని ఉంది. ఇది అమ్మవారి ఆలయానికి దక్షిణంగాను, శ్రీసుందరరాజస్వామివారి ఆలయానికి ఉత్తరంగాను అనగా పై రెండు దేవాలయాల మధ్యలో రెండింటికంటె తగ్గులో వుంది. ఈ కృష్ణస్వామి ఆలయం సరిగ్గా మహాద్వారానికి ఎదురుగా తూర్పుముఖంగా వెలసివుంది. ఆలయం ప్రాంగణంలోని దేవాలయాలలో అన్నింటికంటె ప్రాచీనమైనదిగాను ప్రధానమైనదిగాను చెప్పబడుతున్న ఆలయం శ్రీకృష్ణస్వామి ఆలయం. ఈ కృష్ణస్వామి ప్రాచీనకాలంలోని శాసనాల్లో "అళగియ పెరుమాళ్" అని పిలువబడి శాసనస్థం చేయబడినాడు. అనగా "అందమైన దేవుడు" అని పేరున్న కృష్ణస్వామివారిని ఈ క్షేత్రపాలకుడనికూడ అర్చకస్వాములు చెప్తారు.

ప్రధానమైన ప్రాకార రాజగోపురం దాటి లోపలికి ప్రవేశించగానే ఎదురుగా కన్పించే ఆలయమే శ్రీకృష్ణస్వామివారి సన్నిధి. ప్రాచీన శాసనాలలో "ఆళగియ పెరుమాళ్" (అందమైన దేవుడు) అని పిలువబడిన ఈ శ్రీకృష్ణుని గూర్చి తిరుపతి, తిరుచానూరులలో సుమారు పది శాసనాలు లభ్యమయ్యాయి.

వాటిలో మొదటిది 5వ పరిపాలనాకాలానికి చెందిన రాజరాజ చోళుడు- 3కు చెందినదిగా పరిశోధకుల భావన. అనగా క్రీ.శ. 1221 కాలానికి సంబంధించినది. ఆ వరుసలో లభ్యమయిన చివరిశాసనం క్రీ.శ. 1552 నాటిది.

క్రీ.శ. 12వ శతాబ్దం ప్రారంభ దినాలలోనే ఈ కృష్ణస్వామి ఆలయం నిర్మాణం అయ్యిందని పై శాసనాలవల్ల భావింపబడుతున్నది.

పొక్కీరన్ అనే భక్తుడు స్వంతంగా భూమిని కొని దానిని పంటలు పండించే సాగుభూమిగా తయారుచేసి దాన్ని ఈ ఆలయనిర్వహణకు దానంగా ఇచ్చాడు. ఆ విరాళంతో ఆలయ నిర్వాహకులు పొక్కీరన్ పేరుతో పంగుని ఉత్సవం నిర్వహించారు.

ఆ తర్వాత క్రీ.శ.1467లో విజయనగరరాజు అయిన సాళువ నరసింగరాయలు, శ్రీ వేంకటేశ్వరాలయం ఉగ్రాణం నుండి రెండు పళ్లాల నిండుగా వెన్నను అళగియ పెరుమాళ్ అయిన శ్రీ కృష్ణునికి పంపునట్లుగా, తిరుపతిలోని స్థానత్తార్‌కు ఒక ఆజ్ఞను జారీ చేశాడు. ఇదేగాక సాళువ నరసింగరాయలు తాను స్వయంగా ఈ గుడికి విరాళమిచ్చిన శాసనం కూడా ఒకటి కన్పడుతున్నది.

క్రీ.శ.1541లో అచ్యుతరాయల కాలంలో సాత్తలూర్ శ్రీనివాస అయ్యంగార్ 2770 నార్పణం కానుకను సమర్పించినట్లుగా శాసనం కన్పడుతున్నది. 2770 నార్పణం మొత్తాన్ని ఇతర సేవలకు వినియోగించడంతో పాటుగా ఆది బ్రహ్మోత్సవంలో చివరన జరిగే తీర్థవారి ఉత్సవం నాడు అళగియ పెరుమాళ్‌కు ఒక దోసె పడిని నివేదించవలెనని ఏర్పాటు చేయబడింది.

క్రీ.శ.1552 పడియవేట్టై (పారువేట) ఉత్తరసమయంలో అళగియ పెరుమాళ్ అని పిలువబడే శ్రీకృష్ణుని నివేదనకు గాను రామరాజ కోదండరాజు ఒక కానుక పడిని విరాళంగా సమర్పించుకొన్నాడు.

ఇంతటి విశిష్టత కలిగి, పద్మావతిఅమ్మవారిఆలయం కంటె ప్రాచీనమైనదిగా భావింపబడుతున్న శ్రీకృష్ణస్వామిగుడి మహామండపం, స్నపన మండపం, అంతరాళం, గర్భాలయం అని నాలుగు భాగాలుగా నిర్మింపబడింది.



**మహామండపం:**

సుమారు 24 అడుగుల ఎత్తు, పొడవు, వెడల్పుతో తూర్పు, ఉత్తర, దక్షిణం దిక్కుల మూడ వైపులా తెరచి వుంచబడి నిర్మితమైన ఈ మహామండపంలో వరుసకు నాలుగు స్తంభాల వంతున నాలుగు వరుసలతో మొత్తం 16 స్తంభాలున్నాయి. వీటిల్లో ఈశాన్యమూల మరియు ఆగ్నేయ మూలల్లోని స్తంభాలు రెండు మాత్రమే చోళశైలిలో మలచబడివున్నాయి. ఇక మిగిలిన అన్ని రాతిస్తంభాలమీది శిల్ప నైపుణ్యం విజయనగరశైలికి చెందిందని పరిశోధకుల నిశ్చితాభిప్రాయం.

**స్నపనమండపం:**

మహామండపాన్ని దాటి లోనికి వెళితే వుండేదే స్నపన మండపం. ఇది 24×8.6 పొడవు వెడల్పులతో విరాజిల్లుతూ వున్న ఈ సాధారణ స్నపన మండపమే అసలైన ముఖమండపం అని అభిప్రాయపడటం జరుగుతున్నది.

వరుసకు నాలుగు స్తంభాల వంతున రెండు వరుసల రాతిస్తంభాలు స్నపన మండపంలో వున్నాయి. ఇటీవలి కాలంలో ఉత్తరదక్షిణ దిక్కుల్లో ఇనుప కటాంజనం, తూర్పు దిక్కున గోడ నిర్మాణం చేసినందువల్ల ఇది ప్రత్యేకమైన స్నపన మండపంగా ఏర్పడిందని చెప్పబడుతున్నది. ఇందులోని స్తంభాలు తూర్పుగోడలో కలిసిపోయినందువల్ల విడిపోయినట్లైనది. అనగా అంతకు పూర్వం ఈ స్నపన మండపం మహా మండపంలోని కొంత భాగమే అని నిశ్చయింపబడింది.

**అంతరాళం:**

స్నపన మండపం దాటిన తర్వాత 'అంతరాళం' వుంది. ఇది 24'×5'.5" పొడవు వెడల్పుతో నిర్మింపబడిన అంతరాళంలో ఉత్తరం వారకు

వాయవ్యమూలలో శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి పంచలోహ ఉత్సవమూర్తులు తూర్పుముఖంగా వేదికపై ఏర్పాటు చేయబడినాయి. శ్రీవేణుగోపాలస్వామివారు చతుర్భుజాలతో విరాజిల్లుతూ పై రెండు చేతులలో శంఖచక్రాలను ధరించి, క్రింది రెండు చేతులతో వేణువును వాయిస్తున్నాడు. ఈ ఉత్సవమూర్తులకు ప్రతి నెల రోహిణీ నక్షత్రంనాడు అభిషేకం జరిగిన తర్వాత– ఆ సాయంత్రం తిరుచానూరు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహింపబడుతుంది.

ప్రతి సంవత్సరం శ్రీకృష్ణాష్టమి – శ్రీ కృష్ణజయంతి (రోహిణి) పర్వంనాడు ఈ ఉత్సవమూర్తులకు అభిషేకార్చనలు జరిగిన తర్వాత సాయంత్రం ఊరేగింపు నిర్వహించబడుతుంది.

**గర్భాలయం:**

అంతరాళం దాటిన తర్వాత వున్న గర్భాలయంలో పడమటి గోడవారకు దగ్గరగా తూర్పుముఖంగా రెండు అడుగుల శిలావేదికపై శ్రీకృష్ణుని శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది.

తూర్పు అభిముఖంగా పద్మాసనంలో కూర్చుని రెండు చేతులను క్రింది బారజాచి రెండు హస్తాలను వరద భంగిమలో నెలపై వున్న స్వామి శ్రీకృష్ణస్వామి. ఈ స్వామివారి మూర్తికి ప్రక్కనే మరొక శిలావేదిక పై ఉత్తరాభిముఖంగా శ్రీ బలరాముని శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది. పీఠంపైన ఎడమ కాలును మడిచిపెట్టి పీఠంపైన కూర్చున్న బలరాముడు కుడికాలును క్రిందికి జారవిడిచినాడు. ఎడమచేయిని మడచిన ఎడమ మోకాలి మీద వుంచి, కుతిచేతిని నేలపై ఆన్చి సేదదీరినట్లుగా వున్నాడు. పాదాలకు రెండింటికి పాదరక్షలను ధరించి వున్నాడు. ఇక్కడి బలరామ కృష్ణుల ఇద్దరి మూర్తులకు శిరస్సులపై కిరీటాలు వున్నాయి.



ఇక్కడ వేంచేసి వున్న బలరామకృష్ణులను గూర్చిన ఒకటి రెండు కథనాలు వినపడుతున్నాయి.

కురుక్షేత్ర సంగ్రామం జరుగుతుండగా, ఆ యుద్ధంలో ఎవరి పక్షాన పాల్గొననినీ, అసలు కౌరవ పాండవ యుద్ధసమయంలో ఈ ప్రాంతంలోనే వుండడం సముచితంగా తోపదని, వికల మనస్కుడైన బలరాముడు క్షేత్రాటనకు బయలుదేరి వెళ్లాడు. 18 రోజులపాటు జరిగిన ఈ యుద్ధం ముగిసిన తరువాత శ్రీకృష్ణ భగవానుడు అన్నను వెదుకుతూ శ్రీ శుకమహర్షి ఆశ్రమానికి వచ్చినాడు. అక్కడ శ్రీశుకమహర్షి తన ఆశ్రమంలో విశ్రమించవలసిందని ఆతిథ్యం స్వీకరించవలసిందని అభ్యర్థించాడు. 'సరే'నని అంగీకరించిన శ్రీకృష్ణుడు ఆ ప్రశాంత వాతావరణంలో పద్మాసనం వేసుకొని తన రెండు అరచేతులను మోకాళ్లపై వెల్లకిలా పెట్టుకొని కొంతసేపు ధ్యానస్థుడయ్యాడు. ఇంతలో క్షేత్ర సందర్శనం చేసుకొని ఇక్కడికి చేరిన బలరాముడు శ్రీ శుకుని ఆశ్రమంలో ధ్యానముద్రలో కూర్చొన్న తన తమ్ముడైన శ్రీకృష్ణుని చూచి చాలా ఆనందించాడు. తిరిగి తిరిగి అలసిపోయిన బలరాముడు శ్రీకృష్ణుని చూచిన ఆనందంతో మైమరచి, కాళ్లకు చెప్పులు వదలకుండానే పీఠంపై కూర్చున్నాడు. కొంచెం సేపటికి కళ్లు తెరచిన శ్రీకృష్ణుడు బలరాముని చూచి ప్రస్తుతం తాము వున్న ఈ సప్తగిరి సానువుల ప్రదేశమంతా దివ్యక్షేత్రమనీ, ఇంతకంటే మేటియైన పుణ్యస్థలం లేనేలేదనీ, అంటూ శ్రీకృష్ణుడు తన రెండు అరచేతులతో ఈ దివ్యస్థలాన్ని చూపుతూ, ఇంక క్షేత్రాటనం ఇంతటితో ముగించమని విన్నవించాడని ప్రసిద్ధ కథనం. బలరాముడు కూడ దాని ఆమోదిస్తూ ఇచ్చట శుకమహర్షి ఆశ్రమంలో వేంచేసి వున్న తమను (బలరామ శ్రీకృష్ణులను) దర్శిస్తే చాలు. సమస్త తీర్థయాత్రా ఫలితం సిద్ధిస్తుందని వరమిచ్చాడట. శ్రీ శుకమహర్షి తన

ఆశ్రమానికి వచ్చి తన ఆతిథ్యం తీసుకొన్నందుకు గుర్తుగా వారు ఆనాడు చూపుతూ ఉపదేశించిన భంగిమలతోనే విగ్రహప్రతిష్ఠ చేయించినారని అనాదిగా చెప్పబడుతున్నది.

ఈ గర్భాలయంలో నృత్య భంగిమలో వున్న చిన్నికృష్ణుని పంచలోహ ప్రతిమ, మరియు చిన్న లక్ష్మీనృసింహస్వామి పంచలోహ విగ్రహాలు కూడా చోటు చేసుకొన్నాయి.

గర్భాలయం పైన ద్వితల విమాన గోపురం నిర్మింపబడింది. విమాన గోపురానికి నాలుగు మూలల్లో తిరుమల ఆనంద నిలయ విమానం మీద వున్నట్లుగానే సింహాల శిల్పాలు వున్నాయి. ఈ గోపురంపైన వేసరశైలికి చెందిన గుండ్రని శిఖరమూ, ఆ శిఖరంపైన బంగారు ఏకకలశం ప్రతిష్ఠింపబడి వుంది.

ఈ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ సుందరరాజస్వామి ఆలయాల్లో మాదిరే శ్రీకృష్ణస్వామి ఆలయంలో కూడా పాంచరాత్రాగమ శాస్త్రోక్తంగా శ్రీవైష్ణవ అర్చక స్వాములచే అర్చనలు ఆరాధనలు నిర్వహింపబడుతున్నాయి.

ప్రతి రోజు మూడుపూటలా అర్చనలు, ఆరాధన నివేదనలు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో కంటె కొంచెం ముందుగా శ్రీకృష్ణస్వామి ఆలయంలో నిర్వహింపబడుతవి. అనగా శ్రీ కృష్ణస్వామికి నివేదనలు పూర్తి అయిన తర్వాతనే పద్మావతి అమ్మవారి ఆలయంలో నివేదనాదులు జరుగుతవి.

ప్రతినెల అష్టమితిథి వచ్చే రోజుల్లో శ్రీకృష్ణ బలరాముల మూల మూర్తులకు అభిషేకార్చనలు విశేషంగా జరుగుతవి.

అలాగే ప్రతినెలకు రోహిణీ నక్షత్రంనాడు శ్రీరుక్మిణీ సత్యభామాసమేత శ్రీకృష్ణస్వామివారికి అభిషేకాదులు నిర్వహింపబడిన తర్వాత ఆ సాయంత్రం



పూట ఉత్సవమూర్తులకు తిరుచానూరు గ్రామంలో ఊరేగింపు జరుపబడుతుంది.

ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే శ్రీకృష్ణాష్టమి–రోహిణీ నక్షత్రంనాడు ఈ కృష్ణస్వామివారికి విశేషంగా అభిషేక అర్చనాదులు నిర్వహింపబడిన తర్వాత ఆ సాయంత్రం ఊరేగింపు కూడా జరుపబడుతుంది.

ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో పున్నమి నాటికి పూర్తి అగునట్లుగా ఐదురోజుల పాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారికి పద్మసరోవరంలో తెప్పోత్సవాలు జరుగుతాయి. అందులో భాగంగా తొలినాడు సాయంత్రం శ్రీరుక్మిణీ సత్యభామాసమేత శ్రీకృష్ణస్వామివారికి పద్మసరోవరంలో (తిరుచానూరు పుష్కరిణిలో) తెప్పోత్సవం నిర్వహింపబడుతుంది. సుందరంగా విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దబడిన పద్మసరోవరంలో, మరింత అందంగా అలంకరింపబడిన తెప్పపై శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణస్వామివారు వేంచేసి, పద్మసరోవర పవిత్రజలాల్లో మూడు మారులు ప్రదక్షిణంగా విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చి అలరిస్తారు.

తిరుమల యాత్రికులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి పట్టపు దేవేరి శ్రీ పద్మావతిని దర్శించడంతోపాటు ఆ ఆలయ ప్రాంగణంలోనే వున్న శ్రీకృష్ణ బలరాములను కూడా దర్శించి, సమస్త తీర్థయాత్రా ఫలాన్ని సంపూర్ణంగా పొంది ధన్యులవుతూ వుంటారు.

**కృష్ణం వందే జగద్గురుమ్!!**

## శ్రీ సుందరరాజస్వామి ఆలయం

తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయ ప్రాంగణంలో దక్షిణం వారకు అనగా శ్రీకృష్ణస్వామి ఆలయానికి దక్షిణంగా తూర్పుముఖంగా సుమారు 4 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానం మీద నిర్మింపబడిన ఆలయమే, శ్రీసుందర రాజస్వామివారి ఆలయం. ఈ ఆలయంలోని స్వామివారిని, శ్రీ సుందర వరదరాజస్వామి అనీ, శ్రీ సుందరరాజస్వామి అనీ, శ్రీవరదరాజస్వామి అని భక్తులు పిలుస్తారు. ప్రస్తుతం 'శ్రీసుందరరాజస్వామి' అన్న పేరుతో ఈ దేవుడు ప్రసిద్ధమై వున్నాడు.

ఈ దేవాలయప్రస్తావన శాసనాల్లో కూడా గోచరిస్తున్నది. క్రీ.శ.1541కు చెందిన శాసనంలో వరదరాజస్వామివారి రథోత్సవాన్నీ గూర్చిన ప్రస్తావన వుంది. అలాగే 1547 శాసనం. వరదరాజస్వామివారి బ్రహ్మోత్సవాలను, ఆ ఉత్సవాల చివర్లో జరిగే "విదైయాత్రి" వేడుకను గూర్చి పేర్కొంటున్నది. అంతేగాక ఈ శాసనం ఉగాది, దీపావళి, తెప్పోత్సవాలతో పాటు అధ్యనోత్సవాన్ని గూర్చి కూడా పేర్కొంటున్నందువల్ల ఈ గుడి 16వ శతాబ్దం నాటికే నిర్మించబడిందనీ అభిప్రాయాన్ని పరిశోధకులు వెలిబుచ్చుతున్నారు.

సుందరరాజస్వామివారి ఆలయం 1. మహామండపం 2. ముఖ మండపం 3. అంతరాళం 4. గర్భాలయం నాలుగు భాగాలుగా నిర్మింప బడింది.

ఈ ఆలయం అలంకృతమైన ఎత్తైన రాతి అధిష్ఠానం మీద నిర్మింపబడి వుంది. ఈ అధిష్ఠానభాగం ఉపాన, మూడు పట్టికలుగా అనగా పద్మపట్టిక, త్రిపట్టిక, గళపట్టిక భాగాలుగా విభజింపబడినవి. అంతేగాక ఇవి కపోత



నాసికలతోను ఆలింగపట్టికలతోను అలంకృతమై వున్నాయి. గోడల వెలుపలి భాగంలో వరుసగా రెండు కుడ్యస్తంభాలు, కుంభపంజరం, రెండు కుడ్య స్తంభాలు, కుంభపంజరం, ఒక కుడ్యస్తంభం, శలకోష్ఠ, ఒక కుడ్యస్తంభం, కుంభపంజరం, రెండుకుడ్యస్తంభాలు, కుంభపంజరం మరియు రెండు కుడ్యస్తంబాలు అలంకృతమై వున్నాయి. అంతరాళం గోడలు, రెండు కుడ్యస్థంభాలు, కుంభపంజరం, ఒక కుడ్యస్తంభం శలకోష్ఠ, ఒక కుడ్యస్తంభం, కుంభపంజరం మరియు రెండు కుడ్యస్తంభాలతో అలంకరింపబడి వుంది.

ఇలాగ ఈ ఆలయం గోడల వెలుపలి భాగాలు అన్ని శిల్పశాస్త్ర సంప్రదాయ బద్ధంగా వేసరశైలిలో చక్కగా నిర్మింపబడివున్నాయి.

మహామంటపంలో వరుసకు నాలుగు స్తంభాలవంతున మూడు వరుసలు మరియు ముందువరుసలో కేవలం రెండు స్తంభాలతో మొత్తం 14 స్తంభాలు వున్నాయి. ఈ స్తంభాలు అన్నీ విజయనగర పద్ధతిలో నిర్మింపబడినాయి.

మహామంటపంలో వరుసకు నాలుగు స్తంభాల వంతున మూడు వరుసలు మరియు ముందు వరుసలో కేవలం రెండు స్తంభాలు మొత్తం 14 స్తంభాలు వున్నాయి. ఈ స్తంభాలు అన్నీ విజయనగర పద్ధతిలో నిర్మింపబడినాయి.

ముఖమండపం సాధారణ మండపంగానే నిర్మింపబడింది. ఈ ముఖమండపంలో అంతరాళ ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులైన జయ విజయుల విగ్రహాలు వున్నాయి. ప్రవేశద్వార గోడలకు రెండు వైపులా నాలుగు స్తంభాలు నిర్మింపబడినాయి.

అంతరాళంలో గర్భగుడి ముందున్న గోడ, ప్రవేశద్వారం రెండు కుడ్యస్తంభాలతో, కుంభపంజరంలో అలంకృతమై నిర్మింపబడింది.

గర్భాలయం మధ్య భాగంలో సమభంగి ముద్రలో స్థానకమూర్తి (నిలిచివున్న మూర్తి) అయిన శ్రీ సుందరరాజస్వామివారి శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఈ స్వామి చతుర్భుజుడై వున్నాడు. పైరెండు చేతుల్లో వరుసగా సుదర్శనచక్రం, పాంచజన్య శంఖం, క్రింది కుడిచేయి వరదముద్రలోను, క్రింది ఎడమచేయి క్రిందికి జారవిడచి వున్నాడు. సుమారు 8 అడుగుల ఎత్తు ఉన్న శ్రీ సుందరరాజస్వామివారికి ఇరువైపులా నిలువెత్తు శ్రీదేవి (కుడివైపు), భూదేవి (ఎడమవైపు) శిలావిగ్రహాలు ప్రతిష్ఠింపబడివున్నాయి. ఈ మూలమూర్తులతో పాటు గర్భాలయంలో సుమారు 3 అడుగుల ఎత్తుతో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీసుందరరాజస్వామివారి పంచలోహ ఉత్సవమూర్తులు కూడ నెలవైవున్నాయి. గర్భాలయంపైన ఐదుబంగారుకలశాలతో గోపురం నిర్మింపబడింది.

శ్రీ సుందరరాజస్వామివారికి ఎదురుగా మహా మంటపానికి వెలుపల గరుడ మండపం వుంది. ఇందులో శ్రీ సుందరరాజస్వామివారికి అభిముఖంగా రెక్కలు విప్పుకొని నిలుచున్న గరుత్మంతుని శిలామూర్తి ప్రతిష్ఠింపబడింది. గరుడని విగ్రహమూర్తి పరిశీలించినట్లయితే ఈ సుందరరాజస్వామి ఆలయం చాలాప్రాచీనమైనదిగా తోస్తుంది.

పాంచరాత్రాగమ శాస్త్రోక్తంగా శ్రీ వైష్ణవ అర్చకులచే పూజాదికాలు నిర్వహింపబడుతున్న ఈ సుందరాజస్వామివారికి ప్రతిరోజు మూడుపూటలా అర్చన నివేదనలు జరుగుతున్నాయి. నివేదనలకు వలసిన అన్న ప్రసాదాలన్నీ శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ వంటశాల నుండే పంపబడుతున్నాయి.

ప్రతినెలా సుందరాజస్వామివారి అవతార నక్షత్రమైన ఉత్తరాభాద్ర నక్షత్రంనాడు శ్రీ సుందరాజస్వామివారికి ఉత్సవమూర్తులకు అభిషేకాదులు,



అర్చన, నివేదనలు నిర్వహింపబడిన అనంతరం ఆ సాయంత్రం తిరుచానూరు గ్రామోత్సవం జరుగుతుంది.

ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో పున్నమినాటికి పూర్తి అగునట్లుగా తిరుచానూరు పద్మసరోవరంలో శ్రీ పద్మావతి అమ్మవారికి ఐదురోజుల పాటు తెప్పోత్సవాలు జరుగుతవి. అందులో భాగంగా రెండవ రోజున సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ సుందరరాజస్వామివారికి ఉత్సవమూర్తులకు పద్మసరోవరంలో ఘనంగా తెప్పోత్సవం నిర్వహింపబడుతుంది.

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో శ్రీ సుందరరాజస్వామివారి అవతార నక్షత్రం దినమైన ఉత్తరాభాద్ర నాటికి పూర్తి అగునట్లుగా మూడు రోజులపాటు శ్రీ సుందరరాజస్వామివారికి వార్షిక అవతారోత్సవాలు ఘనంగా వైభవంగా జరుపబడుతవి. ఈ మూడు రోజులపాటు శ్రీ సుందరరాజస్వామివారి మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు ఘనంగా అభిషేక అర్చన నివేదనలు జరుపబడతవి. ప్రతిరోజు సాయంత్రం ఒక్కొక్క వాహనంపై శ్రీ స్వామివారికి ఊరేగింపులు నిర్వహిస్తారు.

సుమారు నూరేండ్లనాడు అనగా క్రీస్తుశకం 1906లో అప్పటి తి.తిదేవస్థానం విచారణ కర్తలు అయిన మహంతుల పరిపాలనలో ముఖ్యంగా మహంతు ప్రయాగదాస్‌జీ వారి ఆధ్వర్యంలో శ్రీ సుందరరాజస్వామివారి గర్భాలయం, గోపురం జీర్ణోద్ధరణ, ఆలయ శిఖరంపైన బంగారు కలశ ప్రతిష్ఠ, ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాలును నిర్వహింపబడినాయి. ఆనాటి నుండి శ్రీ సుందరరాజ స్వామివారికి అవతార మహోత్సవాల పేరిట ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు వైభవంగా ఈ ఉత్సవాలు జరుపబడుతూనే వున్నాయి. ఇటీవల

2006 జ్యేష్ఠమాసంలో మహా అవతారోత్సవాలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహింపబడినాయి.

దేవేరులతో విరాజిల్లుతూ శంఖచక్రాలతో, వరదహస్తంతో నొసటన వేంకటేశ్వరుని మాదిరిగానే పెద్ద నామాలను ధరించి ఎల్లప్పుడు చిరునవ్వులు చిందిస్తూ పేరుకు తగినట్లుగా మహాసౌందర్యంతో అలరారుతూ దర్శనమిస్తూ సార్థక నామధేయుడై అనుగ్రహిస్తున్న శ్రీ సుందరరాజస్వామిని భక్తులు దర్శించుకోవడం సర్వశ్రేయోదాయకం.

**నమః సకలకల్యాణ కారిణే కరుణాత్మనే**
**శ్రీవత్సవక్షసే తస్మై లక్ష్మీనారాయణాత్మనే।**

* * *



**శ్రీపద్మావతి అమ్మవారు (తిరుచానూరు)**

## సమర్పణం



ఒకే సమయంలో, అటు తిరుమల **"ఆనందనిలయం"**లో

శ్రీనివాసుని వక్షఃస్థలంలో

**"వ్యూహలక్ష్మి"**గా

ఇటు తిరుచానూరు **"శాంతినిలయం"**లో అర్చామూర్తిరూపంలో

**"అలమేలుమంగ"**గా

భాసిస్తూవున్న

శ్రీనివాస పరంధాముని పట్టపురాణి

**శ్రీపద్మావతిఅమ్మవారి** దివ్యపాదపద్మాలమీద

సమర్పించిన అక్షరసుమం!

ఈ

# "తిరుచానూరుక్షేత్రం"

**ఓం శ్రీపద్మావత్యై నమః**

**రచయిత**

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**